


# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 256 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 23 జనవరి 2026 | వెల : 4/-


# ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్



- రూ.5వేల కోట్లతో పెట్టుబడి
- దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీతో సీఎం భేటీ
- ఏటా హైదరాబాద్‌లో ఔజుఖీ ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని విజ్ఞప్తి
- ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న యూపీసీ వోల్ట్
- హైదరాబాద్‌లో మానవ వనరులు
- రూ.623 కోట్ల పెట్టుబడి.. ష్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ

దావోస్

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇవాళ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరెమీ జర్గెన్స్‌తో భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో అప్ సదస్సు నిర్వహించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనపై స్పందించిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వస్తున్నాయని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని - మిగతా3లో




## దావోస్.. డెస్టినేషన్ మీటింగ్ అడ్డలా మారింది

- రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్ రావు
- సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అవకతవకలపై విచారణ జరగాల్సిందే
- కాంగ్రెస్ నేతలు దావోస్ వెళ్లి ఏం చేస్తున్నారు
- బీజేపీ అగ్రనేతలతో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున ఐదు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నాం
- జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ లాంటి వారి సభల కోసం బీఎల్ సంతోష్‌కి ప్రతిపాదనలు పంపాం


హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కావాలని బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్ రావు. సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అవకతవకలపై విచారణ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు దావోస్ వెళ్లి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ తీరుపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర కమిటీ సభ్యులకు - మిగతా3లో



## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో 15 మంది నక్సల్స్ మృతి
- మావోయిస్టుల ఏరివేత ముమ్మరం
- సారండా అడవుల్లో భద్రతా దళాల వేట
- 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యం



## లోయలో పడిన ఆర్మీ వాహనం..

- 10 మంది సైనికులు మృతి
- జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు

## రైతుల తర్వాత ఇప్పుడు కార్మికులా?

- నల్ల చట్టాల మాదిరిగానే కొత్త కుట్ర
- అదానీ, అంబానీల కోసమే ఇదంతా
- మహాత్మా గాంధీ పేరును చెరిపేసే ప్రయత్నం
- కొన్నేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది
- బడ్జెట్ సమావేశాల్లో తేల్చుకుంటాం: మల్లికార్జున ఖర్గే



## సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

- మేము ఏ తప్పూ చేయలేదు ఎవరికీ భయపడేది లేదు
- మాజీ మంత్రి కేటీఆర్
- ఫోన్ ట్యాపింగ్ ప్రభుత్వాలు చేయవు పోలీసు వ్యవస్థ చేస్తుంది
- సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతానన్న కేటీఆర్
- ఫోన్ ట్యాపింగ్‌లు ప్రభుత్వాలు చేయవని, పోలీసు వ్యవస్థ చేస్తుంది
- ఆర్ఆర్ ట్యాక్స్, బొగ్గు కుంభకోణంపై మాత్రం ఎలాంటి సిట్ ఉండదు
- రాష్ట్రం ఫిర్యాదు చేస్తే సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తాం



హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతానని, పోలీసు అధికారులను కూడా తాను కొన్ని ప్రశ్నలు అడుగుతానని మాజీమంత్రి కేటీఆర్ తెలిపారు. తన ఫోన్ ట్యాప్ అవుతుందా? అని సిట్ అధికారులను అడుగుతానని చెప్పారు. తాము ఏ తప్పూ చేయలేదుని, ఎవరికీ భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ మేరకు సిరిసిల్లలో విలేకరుల - మిగతా3లో




## అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు

- దేశాల హద్దులు లేకుండా మనమంతా ఒకే గ్రహంపై ఉన్నామన్న భావన కలుగుతుంది
- దిల్లీ ఐఐటీలో ఏర్పాటు చేసిన 'ది మేకింగ్ ఆఫ్ యాన్ ఆస్ట్రోనట్' ప్రోగ్రామ్‌లో సునీతా విలియమ్స్ ప్రసంగం - స్పేస్ సైన్స్, తన అనుభవాన్ని పంచుకుని విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తూ
- "ప్రస్తుతం మానవ అంతరిక్ష పరిశోధనకు చాలా ప్రత్యేకమైన సమయం
- నిజ జీవితంలో ఉన్నట్లే ప్రతి స్పేస్ మిషన్‌కూ ఎత్తుపల్లాలు ఉంటాయి
- కానీ ప్రతీ అనుభవం మనల్ని రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు మెరుగుపరుస్తుంది

## మహాలక్ష్మి పథకం కోసం స్మార్ట్‌కార్డ్

- మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయనున్న ఆర్టీసీ
- మహిళలకు స్మార్ట్‌కార్డులు జారీ చేసేందుకు కార్యాచరణ
- 5 లక్షల మందితో పైలట్ ప్రాజెక్టు
- ప్రతి ప్రయాణికురాలికి 16 అంకెల యూఐడీ నంబర్
- అర్హత లేని ప్రయాణికుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అవకాశం
- ప్రయాణ దూరం, రూట్, సమయాలపై కచ్చితమైన సమాచారం ఉంటుంది
- గ్రామం, మండలం, జిల్లా, జోన్ వారీ వినియోగ సమాచారం లభ్యమవుతుంది



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే. పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎంతోమంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మరింత సమర్థంగా అమలు చేసేందుకు తెలంగాణ ఆర్టీసీ స్మార్ట్‌కార్డుల జారీకి సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ వివరాలను ఆ సంస్థ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. చిప్‌తో కూడినటు వంటి ఈ స్మార్ట్‌కార్డుల తయారీకి రూ.75 కోట్లు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. స్మార్ట్‌కార్డ్ జారీలో భాగంగా ప్రతి ప్రయాణికురాలికి 16 అంకెల యూఐడీ నంబర్ ఇస్తారు. కార్డు ముందుభాగం ఎడమ వైపు లబ్ధిదారు పేరు, గ్రామం, మండలం, జిల్లా తదితర వివరాలు ఉంటాయి. కుడివైపు ఫొటో ఉంటుంది. వెనుక భాగంలో ఉచిత బస్సు పథకానికి సంబంధించిన నియమ నిబంధనలు పొందుపరిచారు. తెలంగాణ - మిగతా3లో

# రైతుల తర్వాత ఇప్పుడు కార్మికులా?



కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల పొట్టకొట్టేలా వ్యవహరిస్తోందని, గతంలో రైతులపై ప్రయోగించిన అస్త్రాలనే ఇప్పుడు నిరుపేద కార్మికులపై ప్రయోగిస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన 'జాతీయ ఉపాధి హామీ కార్మికుల సదస్సు'లో పాల్గొన్న రాహుల్, మోదీ సర్కార్ తీరును ఎండగట్టారు. గతంలో నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టినట్లే, ఇప్పుడు కొత్త చట్టంతో కూలీలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.

**రైతుల్లాగే పోరాడాలి**

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడినట్లు కార్మికులు ఉద్యమించాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. "కొన్నేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. అప్పుడు దేశంలోని రైతులంతా ఏకమయ్యారు. ప్రభుత్వంపై ఉమ్మడిగా ఒత్తిడి తెచ్చారు. దీంతో కేంద్రం దిగిరాక తప్పలేదు. ఆ చట్టాలను వెనక్కి తీసుకుంది. ఇప్పుడు మీ వంతు వచ్చింది. కార్మికులంతా ఏకమైతేనే ప్రభుత్వం దిగి వస్తుంది. కొత్తగా తెచ్చిన వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసేదాకా పోరాడాలి" అని రాహుల్ పిలుపునిచ్చారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని రాహుల్ విమర్శించారు. "మోదీ కోరుకుంటున్న 'భారతదేశ మోడల్' చాలా ప్రమాదకరమైనది. దేశంలోని ఆస్తులన్నీ కొద్దిమంది చేతుల్లోనే ఉండాలి. పేద ప్రజలంతా అదానీ, అంబానీలపై ఆధారపడి బతకాలి. ఇదే బీజేపీ విధానం. ఒక రాజు మాత్రమే అన్ని నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను మారుస్తున్నారు. పేదలకు హక్కులు ఉండకూడదన్నదే వారి ఉద్దేశం" అని రాహుల్ దుయ్యబట్టారు.

**పంచాయతీల అధికారాలకు కత్తెర**

ఉపాధి హామీ పథకం కాన్సెప్ట్‌ను చంపేస్తున్నారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. "యూపీఏ హయాంలో మేం తెచ్చిన ఉపాధి హామీ చట్టం పేదలకు హక్కు కల్పించింది. ఎవరికైతే పని అవసరమో వారికి కచ్చితంగా పని దొరకాలి. ఈ పథకం అమలు బాధ్యత పంచాయతీ రాజ్ వ్యవస్థ చేతిలో ఉండేది. కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వం ఆ కాన్సెప్ట్‌ను చంపేస్తోంది. కొత్త చట్టం ప్రకారం, పని ఎవరికి ఇవ్వాలి? నిధులు ఎవరికి ఇవ్వాలి? అనేది కేంద్రమే నిర్ణయిస్తుంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కార్మికులకు దక్కాల్సిన డబ్బును కాంట్రాక్టర్లకు, అధికారులకు మళ్లిస్తారు" అని రాహుల్ ఆరోపించారు.

**'పేరు కూడా గుర్తురావడం లేదు'**

కొత్త చట్టం పేరుపై రాహుల్ సెటైర్లు వేశారు. కేంద్రం తెచ్చిన 'వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అజీవికా మిషన్' పేరును పలకడానికి రాహుల్ ఇబ్బంది పడ్డారు. "ఆ చట్టం పేరు నాకు గుర్తురావడం లేదు. ఏంటది?" అని సదస్సులో ఉన్నవారిని అడిగారు. అంత క్లిష్టమైన పేరు పెట్టి, అసలు పథకాన్ని నీరుగారుస్తున్నారని ఎద్దేవా చేశారు.

**మహాత్ముడిని మర్చిపోయేలా - ఖర్గే**

ఈ సదస్సులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రసంగించారు. "ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం అంటే, మహాత్మా గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయడమే. గ్రామ స్వరాజ్ అనే భావనను దెబ్బతీయడమే వీరి లక్ష్యం. కొత్త చట్టాన్ని అమలు చేయకుండా అడ్డుకోవా ల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. త్వరలో జరగబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతాం. దీనిపై ప్రభుత్వం అంతు చూస్తాం. గట్టిగా పోరాడతాం" అని ఖర్గే స్పష్టం చేశారు.

**మట్టితో ప్రతిజ్ఞ**

సదస్సుకు దేశం నలుమూలల నుంచి వచ్చిన ఉపాధి హామీ కార్మికులు తమ వెంట పిడికెడు మట్టిని తీసుకొచ్చారు. రాహుల్ గాంధీ, ఖర్గేల సమక్షంలో ఆ మట్టిని మొక్కల్లో వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. కాగా కాంగ్రెస్ పార్టీ జనవరి 10 నుంచి 'ఎమ్‌జీఎన్‌ఆర్ఈజీఏ బచావో సంగ్రామ్' పేరుతో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టింది. 45 రోజుల పాటు ఈ నిరసనలు కొనసాగుతాయి. కొత్త చట్టాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. పని హక్కును కాపాడాలని, పంచాయతీలకే అధికారాలు ఇవ్వాలని కోరుతోంది.

# అసెంబ్లీ నుంచి గవర్నర్ గెహ్లాట్ వాకౌట్!
# గందరగోళంలో శాసనసభ శీతాకాల సమావేశాలు!



**చెన్నై :** గవర్నర్ అసెంబ్లీకి హాజరు కాకపోతే తదుపరి చట్టపరమైన చర్యల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధమైంది. అయితే, అధికార కాంగ్రెస్ నాయకుల అంచనాలకు భిన్నంగా, గవర్నర్ అసెంబ్లీకి వచ్చి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలోని మొదటి, చివరి పేరాల్లోని కొన్ని పంక్తులను మాత్రమే చదివి, ఆ తర్వాత వెళ్లిపోయారుకర్ణాటక రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. జనవరి 22న జరగనున్న రాష్ట్ర శాసనసభ ఉమ్మడి సమావేశంలో ప్రసంగించడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ నిరాకరించారు. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలోని సుమారు 11 పేరాలపై గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈలోగా, గవర్నర్ ప్రసంగం లేకుండా అసెంబ్లీ సమావేశం చట్టబద్ధంగా ప్రారంభం కావచ్చో లేదో పరిశీలిద్దాం.కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్చడాన్ని నిరసిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదానికి దారితీసింది. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అసెంబ్లీ సమావేశానికి హాజరవుతారా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది. అయితే, గవర్నర్ అక్కడికి చేరుకుని ప్రభుత్వ ప్రసంగం పూర్తి కాపీని చదవకుండానే వెళ్లిపోయారు. పాలక పార్టీ ఎమ్మెల్యేలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తరువాత దీనిని ప్రజాస్వామ్యానికి చీకటి దినంగా పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో శాసనసభ గందరగోళంలో పడింది.అంతుకుముందు సిద్ధరామయ్య ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగం నుండి 11 అంశాలను తొలగించాలని గవర్నర్ సూచించారు. అయితే, ప్రభుత్వం దీనిని తిరస్కరించింది. అందువల్ల, ప్రసంగం చేయడానికి గవర్నర్ హాజరు కావడం సందేహాస్పదంగా మారింది. గవర్నర్ అసెంబ్లీకి హాజరు కాకపోతే తదుపరి చట్టపరమైన చర్యల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధమైంది. అయితే, అధికార కాంగ్రెస్ నాయకుల అంచనాలకు భిన్నంగా, గవర్నర్ అసెంబ్లీకి వచ్చి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలోని మొదటి, చివరి పేరాల్లోని కొన్ని పంక్తులను మాత్రమే చదివి, ఆ తర్వాత వెళ్లిపోయారు.గవర్నర్ వెళ్లిపోతుండగా, ఎమ్మెల్సీ బికె హరిప్రసాద్ ఆయనను ఆపడానికి ప్రయత్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. స్పీకర్ యుటి ఖాదర్, స్పీకర్ హ్వరట్టి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గవర్నర్‌కు వీడ్కోలు పలికారు. గవర్నర్ కారు ఎక్కగానే, ఎమ్మెల్సీ ఇవాన్ డిసౌజా, మరికొందరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఇదిలావుంటే, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 గవర్నర్ ప్రసంగం అవసరమైన పరిస్థితులను నిర్దేశిస్తుంది. గవర్నర్ శాసనసభ లేదా శాసనసభ ఉభయ సభలను ఉద్దేశించి రెండు ప్రత్యేక సందర్భాలలో ప్రసంగించాల్సి ఉంటుంది: సార్వత్రిక ఎన్నికల తర్వాత మొదటి సమావేశం, ప్రతి క్యాలెండర్ సంవత్సరంలో మొదటి సమావేశం. ఈ సందర్భాలలో గవర్నర్ ప్రసంగం కేవలం ప్రతీకాత్మకం కాదు, రాజ్యాంగపరమైన అవసరం. ఈ ప్రసంగం ఉద్దేశ్యం శాసన సభ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి గల కారణాలను తెలియజేయడం, ఎన్నికైన ప్రభుత్వ విధాన ప్రాధాన్యతలను పేర్కొనడం జరుగుతుంది. అయితే ఈ ప్రసంగం లేకుండా, సమావేశాన్ని చట్టబద్ధంగా ప్రారంభించడాన్ని గుర్తించే రాజ్యాంగ లాంఛనం అసంపూర్ణంగా ఉంటుంది.సమావేశం సంవత్సరంలో మొదటి సమావేశం లేదా ఎన్నికల తర్వాత మొదటి సమావేశం అయితే, గవర్నర్ ప్రసంగం లేకుండా అసెంబ్లీ చట్టబద్ధంగా శాసనసభ కార్యకలాపాలను ప్రారంభించదు. అటువంటి సమావేశంలో తీసుకున్న ఏదైనా చర్యను కోర్టులో సవాలు చేయవచ్చు. రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించవచ్చు. అయితే, సంవత్సరంలో మొదటి సమావేశం కాని వర్షాకాలం లేదా శీతాకాల సమావేశాలు వంటి సంవత్సరంలోని ఇతర సమావేశాలకు, గవర్నర్ ప్రసంగం అవసరం లేదు.రాజ్యాంగబద్ధంగా తప్పనిసరి అయిన సమయంలో గవర్నర్ ప్రసంగం లేకుండా శాసనసభ కార్యకలాపాలు ప్రారంభమైతే, అది తీవ్రమైన చట్టపరమైన బలహీనతను సృష్టిస్తుంది. అటువంటి సమావేశంలో ఆమోదించిన బిల్లులు, చర్చలు, ఆమోదించిన తీర్మానాలను న్యాయవ్యవస్థ ముందు ప్రశ్నించవచ్చు. కోర్టు మొత్తం సమావేశాన్నే చెల్లదని, దాని ఫలితాలను చెల్లదని ప్రకటించవచ్చు.నిజానికి, 1966 కలకత్తా హైకోర్టు తీర్పు ప్రకారం, గవర్నర్ ప్రసంగంలో కొంత భాగాన్ని చదివినా లేదా అధికారికంగా సభ ముందుకు తెచ్చినా, అది రాజ్యాంగ ఉల్లంఘనగా కాకుండా విధానపరమైన అక్రమంగా పరిగణిస్తారు. అలాంటి చర్య స్వయంచాలకంగా సమావేశాన్ని చెల్లుబాటు కాదు. అయితే, ముఖ్యమైన సమయంలో సభను ఉద్దేశించి ప్రసంగించడానికి పూర్తిగా నిరాకరించడం చాలా తీవ్రమైనది. రాజ్యాంగబద్ధంగా ప్రశ్నార్థకం. ఇదిలావుంటే, గవర్నర్ మొదటి, చివరి పేరాలు మాత్రమే చదివారు కాబట్టి, ఆయన ప్రసంగాన్ని చదివారని భావిస్తున్నారు. సమావేశాన్ని నిర్వహించడంలో ఎటువంటి సమస్య ఉండదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

# దళపతి విజయ్, కమల్‌హాసన్ పార్టీలకు గుర్తులు కేటాయించిన ఈసీ

తమిళగ వెట్రి కజగం(టీవీకే అధినేత, దళపతి విజయ్, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తులను కేటాయించింది. విజయ్ పార్టీకి 'విజిల్' గుర్తును కేటాయించగా, కమల్ హాసన్ పార్టీకి 'బ్యాటరీ టార్చ్' గుర్తును ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు అగ్ర కథానాయకులు ఇప్పుడు రాజకీయ వేదికపై తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు గురువారం తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల జాబితా కింద ఈ గుర్తులను కేటాయించారు. ఎలక్షన్ సింబల్స్ ఆర్డర్, 1968లోని పారా 10బీ నిబంధనల ప్రకారం ఈ పార్టీలకు ఈసీ గుర్తులను కేటాయించింది. రాబోయే తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో (2025-26) ఈ పార్టీలు ఈ గుర్తులపై పోటీ చేస్తాయి. తమ అభ్యర్థులకు కామన్ సింబల్ కేటాయించాలన్న పార్టీల విజ్ఞప్తిని ఈసీ ఆమోదించింది.

**'విజిల్'తో విజయ్ సౌండ్**

విజయ్ ఎంట్రీతో తమిళనాడు పాలిటిక్స్ మారిపోయాయి. యువతలో, మాస్ వర్గాల్లో విజయ్‌కు విపరీతమైన క్రేజ్ ఉంది. ఇప్పుడు ఆయన పార్టీ గుర్తుగా 'విజిల్' రావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఇది విజయ్ పార్టీకి తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కమల్ హాసన్ పార్టీ వీచీవీకి మళ్లీ 'బ్యాటరీ టార్చ్' దక్కింది. గతంలోనూ కమల్ ఇదే గుర్తుపై పోటీ చేశారు. చీకటిని పారద్రోలి వెలుగును నింపే గుర్తుగా కమల్ దీనిని ప్రచారం చేసుకుంటున్నారు. డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమల్ భావిస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

ఈ గుర్తుల కేటాయింపులో కొన్ని షరతులు కూడా ఉన్నాయి. ఈ పార్టీలు పోటీ చేయని నియోజకవర్గాల్లో, ఈ గుర్తులు ఇతర స్వతంత్ర అభ్యర్థులకు 'ఫ్రీ సింబల్'గా అందుబాటులో ఉంటాయి. అలాగే భవిష్యత్తులో ఈ గుర్తులను శాశ్వతంగా దక్కించుకోవాలంటే, ఈ పార్టీలు మొత్తం అసెంబ్లీ సీట్లలో కనీసం 5 శాతం స్థానాల్లో పోటీ చేయాలి. లేకపోతే ఈ గుర్తులను కోల్పోయే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అప్పుడే ప్రచార వేగం పెంచింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తొలి విడత మేనిఫెస్టోను ప్రకటించారు. జనవరి 17న ఆయన కీలక హామీలు ఇచ్చారు. 'కులవిళక్కు పథకం' కింద మహిళలకు ఆర్థిక సాయం ప్రకటించారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలోని మహిళా పెద్దకు నెలకు రూ.2,000 నేరుగా బ్యాంకు ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చారు. ఇది అధికార డీఎంకే ప్రభుత్వానికి గట్టి సవాలుగా మారింది.

**విజయ్‌కు సీబీఐ చిక్కులు**

రాజకీయంగా దూసుకెళ్తున్న విజయ్‌కు న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. కరూర్ తొక్కిసలాట ఘటన ఆయన్ను వెంటాడుతోంది. ఈ కేసులో విజయ్ ఇప్పటికే సీబీఐ విచారణను ఎదుర్కొంటున్నారు. ఇది రాజకీయ కక్షసాధింపు అని విజయ్ అభిమానులు ఆరోపిస్తుండగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అధికారులు అంటున్నారు. ఈ వివాదం ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. తమిళనాడులో ఈ ఏడాది ప్రథమార్థంలోనే ఎన్నికలు జరగాల్సి ఉంది. అధికార డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించడానికి విపక్షాలన్నీ ఏకమవుతున్నాయి. విజయ్, కమల్ రాకతో ఓట్లు చీలిపోయే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా అధికారిక షెడ్యూల్ విడుదల చేయలేదు. కానీ పార్టీలు మాత్రం అప్పుడే ప్రచార బరిలోకి దిగాయి.

## లోయలో పడిన ఆర్మీ వాహనం



జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబా-బందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు. ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.

## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ



ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సింగ్‌భూం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారు. సారండా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, సింగ్‌భూం జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిర్మూలన చర్యలను ముమ్మరం చేశాయి. ఝార్ఖండ్‌లో జరిగిన ఈ తాజా ఎన్‌కౌంటర్‌ను కూడా ఈ ఆపరేషన్లలో భాగంగానే అధికారులు చూస్తున్నారు. మృతుల గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ ఘటనతో మావోయిస్టుల ఏరివేత దిశగా మరో కీలక ముందడుగు పడినట్లయిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు




అంతరిక్షం నుంచి చూస్తే దేశాల సరిహద్దులు కనుమరుగై, మనమంతా ఒకే గ్రహంపై నివసిస్తున్నామన్న భావన కలిగిందని నాసా అంతరిక్ష రిటైర్డ్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దిల్లీ (ఐఐటీ దిల్లీ)లో ఏర్పాటు చేసిన 'ది మేకింగ్ ఆఫ్ యాన్ ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ స్టోరీ' అనే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ క్రమంలోనే ఆమె తన ప్రసంగంలో అంతరిక్ష విజ్ఞానంతో పాటు తన అనుభవాన్ని పంచుకుని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ మేరకు ఆమె స్పేస్‌లో గడిపిన క్షణాలను వీడియో ద్వారా విద్యార్థులకు చూపించారు. కాగా, గతేడాది(2025) డిసెంబర్ 27న ఆమె పదవీ విరమణ చేసినట్లు అధికారికంగా ప్రకటించగా, ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నారు.

**అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు**

అంతరిక్షమంటే కేవలం నక్షత్రాలు, గ్రహాల పేరు మాత్రమే కాదని, మనిషి తనను తాను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తుందని ఆమె నిరూపించారు. 27 ఏళ్లపాటు నాసాలో పనిచేసిన ఆమె మూడు సార్లు స్పేస్ వాక్ చేశారు. ఎన్నో అంతరిక్ష పరిశోధనలకు కృషి చేశారు.ల "ప్రస్తుతం మానవ అంతరిక్ష పరిశోధనకు చాలా ప్రత్యేకమైన సమయం. నిజ జీవితంలో ఉన్నట్లే ప్రతి స్పేస్ మిషన్‌కూ ఎత్తుపల్లాలు ఉంటాయి. కానీ ప్రతీ అనుభవం మనల్ని రాబోయే సవాళ్లను ఎదుర్కునేందుకు మెరుగుపరుస్తుంది. అంతరిక్ష మిషన్లలోనూ ఎన్ని అత్యాధునిక వ్యవస్థ ఉన్నప్పటికీ, ఒక్కోసారి సమస్యలు ఎదురవుతుంటాయి. కొన్నిసార్లు వీటికి పరిష్కారాలు కూడా చాలా సులభంగానే ఉంటాయి. అయితే, మనం నేర్చుకున్న విద్యను సరైన సమయంలో, ఏకాగ్రతతో అన్వయించడమే ఆటంకాలను అధిగమించడానికి సరళతరం చేస్తుంది. ఇది నిజ జీవితంలోనూ పనిచేస్తుంది" అని ఆమె విద్యార్థులకు సూచించారు.

**స్పేస్ నుంచి చూస్తే**

గురుత్వాకర్షణ వల్ల ఆహార పదార్థాలు, మందులు, మానవ ప్రవర్తనలో వచ్చే మార్పుల గురించి ఆమె వివరించారు. గురుత్వాకర్షణ లేని స్పేస్‌లో నివసించడానికి, గ్రావిటీ ఉన్న భూమిపై జీవించడానికి విజ్ఞాన శాస్త్రం ఎప్పుడూ కొత్త దిశను చూపుతుందని చెప్పారు. అయితే, అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు దేశాల మధ్య సరిహద్దులు అదృశ్యమవుతాయని, మనమంతా ఒకే గ్రహం మీద నివసిస్తున్నామనే భావన కలుగుతుందని ఆమె చెప్పుకొచ్చారు. దీన్నే అవలోకన ప్రభావం (ఓవర్‌వ్యూ ఎఫెక్ట్) అంటారని ఆమె వివరించారు.

**భారతీయ ఆహారం ప్రత్యేక అనుభూతి**

అంతరిక్షంలో తోటి వ్యోమగాములతో కలిసి భారతీయ ఆహారాన్ని పంచుకోవడం అత్యంత సంతోషకరమైన, భావోద్వేగ క్షణమని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే, మనం చేసే పనిలో మన తోటి వారితో కలిసి నడవాలని సూచించారు. విజయానికి టీమ్‌వర్క్ ముఖ్యమని ఆమె తెలిపారు. తన బాల్యంలో క్రీడలు, ఈత ద్వారా నేర్చుకున్న టీమ్ వర్క్ అంతరిక్ష ప్రయాణాల్లోనూ తనకు ఎంతో ఉపయోగపడిందని సునీతా విలియమ్స్ వెల్లడించారు. కాగా, ప్రొఫెసర్ వీఎన్ వజిరానీ ఇన్ స్టిట్యూట్ లెక్చర్ సిరీస్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో సునీతా విలియమ్స్ పాల్గొన్నారు. ప్రొఫెసర్ వజిరానీ కుమారులు విజయ్, ఉమేష్ వజిరానీలు తమ తండ్రి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఐఐటీ దిల్లీ డైరెక్టర్, అధ్యాపకులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

-మొదటిపేజీ తరువాయి

సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసుల నేపథ్యంలో విలేకరులు ప్రశ్నలు అడగగా రేవంత్ రెడ్డి సిట్ అంటే సిట్ స్టాండ్ అంటే స్టాండ్ అనే పరిస్థితి ఉందని కేటీఆర్ చెప్పారు. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదని ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం బావమరిది సృజన్ రెడ్డి బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు ఉదయం బయటపెడితే, సాయంత్రం సిట్ నోటీసులు వచ్చాయన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి కుమారుడు ప్రైవేటు భూములు కబ్జా చేస్తే మాత్రం దానిపై సిట్ ఉండదన్నారు.

**ఆర్ఆర్ ట్యాక్స్‌పై సిట్ ఉండదు**

అమృత్ టెండర్లలో సృజన్‌రెడ్డి కంపెనీకి అర్హత లేకపోయినా ప్రభుత్వం కాంట్రాక్టులు దక్కించుకున్నారని, ఈ విషయంలో కేంద్రమంత్రికి ఆధారాలు ఇచ్చామని ఇంతవరకు దానిపై దర్యాప్తు చేయలేదని కేటీఆర్ తెలిపారు. గచ్చిబౌలి భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగినా, రేవంత్ రెడ్డి స్కామ్‌లపై కేంద్రం స్పందించట్లేదని కాపాడుతున్నారని ఆరోపించారు. ఆర్ఆర్ ట్యాక్స్, బొగ్గు కుంభకోణంపై మాత్రం ఎలాంటి సిట్ ఉండదని దుయ్యబట్టారు. రాష్ట్రం ఫిర్యాదు చేస్తే సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తామని కిషన్‌రెడ్డి చెబుతున్నారని ఆక్షేపించారు. ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే రాష్ట్రం కోరితే చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లు ప్రభుత్వాలు చేయవని, పోలీసు వ్యవస్థ చేస్తుందని కేటీఆర్ అన్నారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, మాజీ హోం సెక్రటరీ రవిగుప్తా వంటి అధికారులను సిట్ ఎందుకు ప్రశ్నించట్లేదని ఆక్షేపించారు. కేవలం ప్రతిపక్ష నాయకులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని చెబితే దానిని ప్రభుత్వం ఖండించలేదని, ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా? అని ప్రశ్నించారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధం లేని నేతలను ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి దావోస్ నుంచి వచ్చే వరకు తన పదవి



ఉప ముఖ్యమంత్రి, నల్గొండ బాంబులు ఎవరూ కూలుస్తారో అనేది ఆయన భయమన్నారు. అందుకే పదిరోజుల పాటు ఈ నోటీసులంటూ డ్రామాలాడుతూ సీఎం శునకానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రేవంత్‌రెడ్డి సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదు. అసమర్థ పాలన. ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు ఆడుతున్నారు. సీఎం బావమరిది సృజన్ రెడ్డి బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు ఉదయం బయటపెడితే సాయంత్రం నోటీసులు వచ్చాయి. మంత్రి పొంగులేటి కుమారుడు ప్రైవేటు భూములు కబ్జా చేస్తే మాత్రం సిట్ ఉండదు" -కేటీఆర్, మాజీమంత్రి

**కార్తీకదీపంలా ఫోన్ ట్యాపింగ్ కేసు**

ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేయట్లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ లేదనే విషయం విచారణాధికారులకు కూడా తెలుసన్నారు. సిట్ విచారణలో అడిగిందే అడుగుతున్నారని, కార్తీకదీపం సీరియల్ సమయం గడుపుతున్నారని చెప్పారు. ప్రజలకు పనికొచ్చే ఒక్క పని ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కారు చేయలేదన్నారు.ఫోన్ ట్యాపింగ్ క్రీడలో చివరకు బలి పశువులయ్యేది అధికారులేనని కేటీఆర్ అన్నారు. ప్రజల దీవెనతో వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సీఎం అవుతారని, ఏ ఫోన్లు ట్యాప్ అయ్యాయో అప్పుడు అన్నీ బయటకు వస్తాయన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేయట్లేదా? అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును సాక్షిగానే పిలిచారని బాధితుడిగా పిలవలేద న్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికలకు మించిన ఫలితాలు వస్తాయని, జడ్పీ ఎన్నికలను తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో పరాభవం తప్పదని కాంగ్రెస్‌కు అర్థమైందని చెప్పారు. గతంలో జిల్లాలను అశాస్త్రీయంగా చేశారని ప్రభుత్వ పెద్దలు ఆరోపిస్తున్నారని, కేసీఆర్ ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేయాలని కుట్ర జరుగుతోందన్నారు. కేసీఆర్ ఆనవాళు చెరిపేయాలని చూస్తే గట్టిగా పోరాటం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ సర్వసన్నద్ధంగా ఉందని, పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తున్నట్లు తెలిపారు.

# సీటీలో రోడ్ల విస్తరణ


**హైదరాబాద్ :** హైదరాబాద్ వాసులకు హెచ్ఎండీఏ తీపి కబురు చెప్పింది. నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్లతో పాటు.. కొన్ని జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. వ ఇప్పటికే చాలా వరకు ప్రాజెక్టులో మొదలు కాగా.. మరికొన్నింటికి టెండర్లను ఆహ్వానించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భూ స్థాయిలో 4 లైన్ల రోడ్డును.. దాంతో పాటే 6 లైన్ల రోడ్డుతో రెండు భాగాలుగా అనుసంధానం చేసే ప్రణాళికలను హెచ్ఎండీఏ చేపట్టింది. హైదరాబాద్ మహా నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నగరం మధ్యలో నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 6 లైన్ల రహదారుల నిర్మాణం.. ప్రస్తుతం ఉన్న 3 లైన్ల రోడ్లను 4 లైన్లుగా మార్చే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది.ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే నానక్‌రాంగూడ నుండి గచ్చిబౌలి వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇక్కడ సర్వీసు రోడ్డు కాకుండా ప్రధాన మార్గం మూడు వరుసలుగా ఉంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ రహదారిని 4 లైన్ల మార్గంగా మార్చనున్నారు. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 26.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ విస్తరణతో అవుటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం ప్రయాణికులకు సులభతరం కానుంది.కోకాపేట, మణికొండ, పుప్పాలగూడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న



ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎంజీఐటీ నుండి మణికొండ వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. సుమారు 3.57 కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో 6 లైన్ల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, వరద నీటి కాలువలు, ఆధునిక ల్యాండ్‌స్కేపింగ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది పూర్తయితే గండిపేట పరిసర ప్రాంతాల నుండి నగరంలోకి వచ్చే వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.బంజారాహిల్స్ ఐసీసీసీ టవర్ నుండి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నగర రవాణా వ్యవస్థలో కీలక మలుపు కానుంది. రూ. 1,656 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ కారిడార్ ద్వారా బంజారాహిల్స్ నుండి గచ్చిబౌలి వరకు ఎక్కడా సిగ్నల్స్ లేకుండా ప్రయాణించవచ్చు. ఈ మార్గంలో ఫిల్మ్ నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి కీలక జంక్షన్ల వద్ద ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. భూస్థాయిలో.. ఎలివేటెడ్ విధానంలో 4, 6 వరుసలుగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం ద్వారా హైటెక్ సిటీ ప్రాంతం లో ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తొలగిపోనున్నాయి.

# ఎన్నికలకు రెడీ అవుతున్న పార్టీలు

**ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైనది ఒకవైపు ఎండలు వేడి ఎక్కువవుతుంది మరోవైపు రాజకీయ వేడి ఎక్కువవుతుంది ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఖమ్మం జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఏదులాపురం,వైరా, కల్లూరు మధిర,సత్తుపల్లి లో ఎన్నికలు ఇన్చార్జిలను నియమించుకున్నారు. మరోవైపు చాప కింద నీరు లాగా బలంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలైన సిపిఐ సిపిఎం పార్టీలు కూడా సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్ ని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు వాళ్లకు బలంగా ఉన్నచోట పోటీ చేసి మిగతా చోట్ల ఎవరికి మద్దతు ఇవ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు మిగతా పార్టీలైన బిజెపి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సైతం పోటీలో సిద్ధంగా ఉన్నాము అంటూ క్యాడర్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో మంచి జోష్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే హవా కొన సాగించాలని, బిఆర్ఎస్ పార్టీ కూడా గత వైభవాన్ని దృష్టిలో ఉంచుకొని బాగా పనిచేసే మంచి ఫలితాలను సాధించాలని వ్యూహరచనలు చేస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ టిఆర్ఎస్ సీపీఐ సిపిఎం పార్టీలు మధ్య పోటీ ఉండగా, కాంగ్రెస్ సిపిఐ కలిసి పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి, అదేవిధంగా బిఆర్ఎస్ సీపీఎం పార్టీలు కలిసి పోటీ చేసే ఆలోచనలు



ఉన్నట్లు కనిపిస్తున్నాయి అదే దిశగా పావులు కదుపుతున్నారు. ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు మంత్రులు సంకల్పంతో పనిచేస్తున్నారు.రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి నియోజకవర్గంలో ఉన్న ఏదులాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే మంత్రి పలుమార్లు పర్యటించి ఇన్చార్జిలని నియమించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిధిలో ఉన్న మధిర మున్సిపాలిటీలో అన్ని వార్డులతో సహా ఇన్చార్జిలను నియమించి వారితో చర్చించి దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇకపోతే వైరా కల్లూరు సత్తుపల్లి మున్సిపాలిటీలలో మంచి పట్టు ఉన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఎమ్మెల్యే రాగమయి సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు దయానంద్ తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు చర్చించి వ్యూహాలను తయారు చేస్తున్నారు.మొత్తం మీద ముగ్గురు మంత్రులు కలిసి ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో అన్ని వార్డులతో సహా కైవసం చేసుకోవాలని మంచి పట్టుదలతో పని చేస్తున్నారు. మరోపక్క బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అజయ్ కుమార్ వైరా పై దృష్టి పెట్టి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. మధిరకు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, లింగాల కమల్ రాజు విస్తృతంగా పర్యటించి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ఎదులాపురం మున్సి పాలిటీలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి,కల్లూరు సత్తుపల్లి కి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య లను ఇన్చార్జిలుగా నియమించి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షిస్తున్నారు. ఇలా ఖమ్మం జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో జెండాలు ఎగురవేసేందుకు ఎవరి వ్యూహాల్లో వారు రచిస్తున్నారు. ఖమ్మం అంటే తెలుగుదేశం కంచుకోట అని, కనుక తెలుగు తమ్ముళ్లు ఎవరికి మద్దతిస్తే వాళ్లే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనేది అందరూ భావిస్తున్నారు. ఇదే విషయాన్ని టిడిపి తమ్ముళ్లు పట్టు ఉన్నచోట పోటీ చేయాలని ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్ళారు. ఇందుకు టీడీపీ నాయకులు దానికి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈసారి ఖమ్మం జిల్లాలో టిడిపి కూడా పోటీలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## "నా భారత్ - నా ఓటు"

**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,జనవరి22 (సూర్యరేఖ)** ఈ నెల 25వ తేదీన16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో "నా భారత్-నా ఓటు"అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు.ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు,బ్యానర్లు,ప్రసార మాధ్యమాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని,ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిదాయంగా చూపించడం జరుగుతుందని బ్యాంకులు, పోస్టాఫీసులు రైల్వే, పంచాయతీరాజ్ ఇతర శాఖల సమన్వయంతో, కార్పొరేట్ సంస్థలు సొసైటీల ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, వెబినార్ సెమినార్ల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ఓటు ఆవశ్యకతను వివరించడం జరుగుతుందని తెలిపారు.నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని, ప్రాంతీయ భాషలో ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్,పోస్టల్ బ్యాలెట్,పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు హెల్ప్ లైన్ యాప్,ఓటు విలువ తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీడియోలు రూపొందించి ప్రదర్శించడం జరుగుతుందని దినపత్రికలు, ఛానళ్ళు,హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఓటరు ప్రతిజ్ఞ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ నెల23వ తేదీ ఉదయం 11గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని,సంబంధిత ఫోటోలు, వీడియోలను ఆయాశాఖల సోషల్ మీడియా ఖాతాలలో అప్ లోడ్ చేయాలని,ఈ నెల 25వ తేదీన ఉదయం 11గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఓటరు దినోత్సవ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అధికారులు,యువత,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ం

## ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్

-మొదటిపేజీ తరువాయి

మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది సమ్మర్ దావోస్ జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావనకు తీసుకొచ్చారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్‌లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.

**వీటికే మా ప్రాధాన్యత :** అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్పోర్ట్స్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై చర్చించారు.

**ఏఐ డేటా సెంటర్ :** మరోవైపు దావోస్‌లో తెలంగాణకు మరో భారీ పెట్టుబడి లభించింది. కొత్తగా నిర్మించే ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్ నెలకొల్పనున్నట్లు యూపీసీ వోల్ట్ సంస్థ వెల్లడించింది. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో క్రమంగా రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే రూ. 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికిపైగా ఉద్యోగ అవకాశాలుంటాయని ప్రభుత్వం వెల్లడించింది.

ప్రపంచ ఆర్థిక సదస్సులో పెట్టుబడులను ఆకర్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఎం రేవంత్ లోకేశ్‌కు జ్ఞాపికను అందజేశారు.

**రూ.623 కోట్ల పెట్టుబడి.. స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ**

రాష్ట్రంలో స్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ తమ యూనిట్లను విస్తరించనుంది. శంషాబాద్, గాగిల్లాపూర్లలో రూ.623 కోట్ల పెట్టుబడితో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక - 2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్నైడర్ కంపెనీ సీఈవో దీపక్ శర్మతో సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ స్టోరేజ్ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రీయల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుంది. స్నైడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలోనే 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కృషి చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. 2047 నాటికి నెట్ జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో పర్యావరణ పరిరక్షణ కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంధన నిర్వహణ, ఆటోమేషన్, ఈవీ భాగాల తయారీలో స్మార్ట్ ఫ్యాక్టరీల విస్తరణపై మంత్రులు చర్చించారు. ప్రస్తుతం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా తెలంగాణ ఎదిగిందని మంత్రులు తెలిపారు.

## మహాలక్ష్మి పథకం కోసం ఆర్టీసీ 'స్మార్ట్‌కార్డ్'

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మందికి ఈ స్మార్ట్‌కార్డులు జారీచేస్తారు. తొలిదశలో 5 లక్షల స్మార్ట్‌కార్డులతో పైలట్ ప్రాజెక్టు చేపడతామని ఆర్టీసీ పేర్కొంది. ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఆర్టీసీ పేర్కొంది. సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆధారంగా ఉచిత ప్రయాణికుల్ని గుర్తించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. దీంతో పాటు పౌరసరఫరాల శాఖ నుంచి పొందిన సమాచారాన్ని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో సమన్వయం చేసి వ్యాలిడేట్ డేటా ఇస్తుందని ఆర్టీసీ ప్రభుత్వానికి నివేదించింది.

# మైనారిటీ బాలికల భవిష్యత్తుకు కొత్త దారి








**బెల్లంపల్లిలో గురుకుల అడ్మిషన్ పోస్టర్ ఘన ఆవిష్కరణ..**

**బెల్లంపల్లి,జనవరి 22(సూర్యరేఖ)**ఐబెల్లంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల (బాలికలు1)లో 5వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు ప్రవేశాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభమైన సందర్భంగా గురువారం (22-01-2026) ఉదయం 11గంటలకు బెల్లంపల్లి మైనార్టీ పాఠశాల మరియు కళాశాల ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్.ఎల్.సి.కొమరంభీమ్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి దాసరి రాజేందర్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దాసరి అరుణ,ఎక్స్ కౌన్సిలర్ ఆస్మా, అకాడమిక్ కోఆర్డినేటర్ రిజ్వాన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఇమాములు,మైనార్టీ నాయకులు తల్లిదండ్రులు పాఠశాల కళాశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ. మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న గురుకుల విద్యాసంస్థలు భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారుతున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు వసతి భోజనం, క్రమశిక్షణతో కూడిన విద్యా విధానం విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని అన్నారు.అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం.డి.నీలు మాట్లాడుతూ. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని విద్యార్థులకు పోషకాహారం నిరంతర పర్యవేక్షణతో సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7995057889 నెంబర్‌ను సంప్రదించాలని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# మైలార్ దేవ్ పల్లి డివిజన్ అభివృద్ధే ప్రధాన లక్ష్యం







**బస్తీ పర్యటనలో నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లి డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన కర్తవ్యమని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గురువారం డివిజన్‌లోని మెహిఫిల్ వెనుక ప్రాంతంలోని మైలార్ దేవ్ పల్లి ప్రధాన గ్రామం,పరిసర ప్రాంతాల్లో దాదాపు అన్ని ప్రాంతాల్లో జాయింట్ కలెక్షన్ పనులు పూర్తి అయ్యే విధంగా అభివృద్ధి పనులలో భాగంగా దాదాపు రూ.20 లక్షల రూపాయల విలువగల నూతన భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ,పైప్ లైన్ పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జలమండలి అదికారులు,పార్టీ నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి డివిజన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత కొరవడితే సహించేది లేదన్నారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం ఖదీర్,లోక్నాథ స్థానిక బస్తీ నాయకులు పిల్లి శేఖర్ యాదవ్,కుంబ యాదయ్య,జగన్ యాదవ్,అయిటి పాముల మల్లిఖార్జున్,అయిటి పాముల దయానంద్ రామిడి మధుసూదన్ రెడ్డి,ఎన్ను శంకర్ రెడ్డి,గుమ్మడి రవీందర్ రెడ్డి,కే.ఎన్. ఉమామహేశ్వర్ జీ,కే.ఎన్.దయానంద్ జీ,మజర్,జీహెచ్ఎంసీ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# "నా భారత్ - నా ఓటు"

**- అదనపు కలెక్టర్ నగేష్...**

**- మెదక్ మున్సిపాలిటీ నుండి జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ నిర్వహణ....**



**మెదక్,జనవరి22(సూర్య రేఖ):** ఈ నెల 25 వ తేదీన 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు.కలెక్టరేట్ కార్యాలయంలో ఓటర్ అవగాహన ర్యాలీపై అధికారులతో సమీక్షించారు.16 వ జాతీయ ఓటరు దినోత్సవంలో "నా భారత్ - నా ఓటు" అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు.ఈ ఓటర్ అవగాహన ర్యాలీ మెదక్ మున్సిపాలిటీ నుండి ప్రారంభమై జూనియర్ కాలేజీ గ్రౌండ్ వరకు కొనసాగి అక్కడ ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు,బ్యానర్లు,ప్రసార మాధ్యమాలు,ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో దివ్యాంగులు వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిదాయంగా చూపించడం జరుగుతుందని బ్యాంకులు పోస్టాఫీసులు రైల్వే పంచాయతీరాజ్ ఇతర శాఖల సమన్వయంతో, కార్పొరేట్ సంస్థలు,సొసైటీల ఆధ్వర్యంలో వ్యాసరచన ఉపన్యాసం వెబినార్ సెమినార్ల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ఓటు ఆవశ్యకతను వివరించడం జరుగుతుందని తెలిపారు. నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని,ప్రాంతీయ భాషలో ఈవీఎంవివి. ప్యాట్,పోస్టల్ బ్యాలెట్,పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు,హెల్ప్ లైన్ యాప్,ఓటు విలువ తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీడియోలు రూపొందించి ప్రదర్శించడం జరుగుతుందని,దినపత్రికలు,ఛానళ్ళు,హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని,ఓటరు ప్రతిజ్ఞ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు,ప్రభుత్వ,ప్రైవేట్ విద్యా సంస్థలలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని,సంబంధిత ఫోటోలు,వీడియోలను ఆయా శాఖల సోషల్ మీడియా ఖాతాలలో అప్ లోడ్ చేయాలని,ఈ నెల 25వ తేదీన ఉదయం 9.30 గంటలకు మెదక్ మున్సిపాలిటీ కార్యాలయం నుండి జూనియర్ కాలేజ్ వరకు నిర్వహించే ఓటరు దినోత్సవ ర్యాలీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు,యువత,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి,జిల్లా విద్యాశాఖ అధికారి విజయ,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,ఇతర జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో రాజేశ్వర్




**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ) :** మండలంలోని బొక్కలగుట్ట, అందుగులపేట గ్రామ పంచాయతీలలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు,నర్సరీలు,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను,గాంధారి మైసమ్మ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ రాజేశ్వర్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను పకడ్బందీగా చేపట్టి ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని కోరారు.లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేసి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీలలో మొక్కలను సంరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాజేంద్రనగర్ లో విద్యుత్ సరఫరాలో అంతరాయం



**రాజేంద్రనగర్,జనవరి 22 (సూర్యరేఖ)** వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థలలో గల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలలో ఉన్న ప్రాంతాలలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్, మాణిక్యమ్మకాలనీ, మానసాహిల్స్ కొత్వాల్ గూడ,గ్రీన్ వాక్ వేస్, బుద్వేల్,గ్రీన్ సిటీ ,జానచైతన్య ఫేజ్ ,టీచర్స్ కాలనీ,సాయికృష్ణకాలనీ బగవత్‌గూడ,లలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ఎన్ఐఆర్ డి విద్యుత్ సబ్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి నుండి 1 గంటల వరకు రాజేంద్రనగర్, ఎన్ఐఆర్డీ, ఎంఆర్వో ఆఫీస్, మేనేజ్, గ్రేహౌండ్, మాణిక్యమ్మకాలనీ,మీసేవ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల అధికారుల సెల్ నంబర్లు 8712470086 రాజేంద్రనగర్ 8712470138,లు

## బై పాస్ రోడ్ విస్తరణ పనుల్లో జాప్యంపై హెచ్‌ఎండిఏ అధికారులపై జగ్గారెడ్డి, నిర్మల ఆగ్రహం

బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం

ఆగ మేఘాల మీద కదిలిన యంత్రాంగం

**ఐబి కాంపౌండ్ వాల్ కూల్చి వేసి, చెట్లను నరికి రోడ్ విస్తరణ పనులు ప్రారంభించిన అధికారులు**

**సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్ విస్తరణ పనుల్లో జాప్యం పై ఊఓఆం అధికారులపై జగ్గారెడ్డి, నిర్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో. గురువారం ఉదయం నుండే అధికారులు ఆగ మేఘాలపై పనులు ప్రారంభించారు. ఐబి ప్రహరీ గోడ ను జేసిబి ల సహాయంతో కూల్చి వేశారు. రోడ్ కు అడ్డంగా ఉన్న చెట్లను నరికి వేసి రోడ్ వెడల్పు పనులు ప్రారంభించారు. పనులకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ఐబి గెస్ట్ హౌస్ నుండి సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వరకు భారీకేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. విస్తరణ పనులు వేగవంతం కావడం పై పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. విస్తరణ పనులు పూర్తయితే ఐబి గెస్ట్ హౌస్ నుండి మొదలుకొని బస్వేశ్వర విగ్రహం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని పట్టణ వాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్య క్షుడు జార్జ్, నాయకులు షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్ లు ఐబి వద్ద పనులను పర్యవేక్షించారు.

## ఉస్మానియాలో 'ప్రజాస్వామ్య గొంతుకల అణచివేత'

**ప్రొఫెసర్ మనోహర్ అక్రమ సస్పెన్షన్‌పై గవర్నర్‌కు డాక్టర్ శ్రవణ్ దాసోజు ఫిర్యాదు**

**హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయ (రాజ) ప్రస్తుత పాలన తీరుపై మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత డాక్టర్ శ్రవణ్ కుమార్ దాసోజు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బి. మనోహర్‌ను అక్రమంగా, ఏకపక్షంగా సస్పెండ్ చేయడం "భావప్రకటనా స్వేచ్ఛను క్రూరంగా అణచివేయడమే" అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ తెలంగాణ గవర్నర్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌కు గురువారం ఆయన ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.జనవరి 12, 2026 నాటి సస్పెన్షన్ ఉత్తర్వు కేవలం పరిపాలనాపరమైన లోపం కాదని, ఇది విశ్వవిద్యాలయంలో భయాందోళనలను సృష్టించేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనని డాక్టర్ శ్రవణ్ మండిపడ్డారు.'నిశ్శబ్ద జైళ్లు'గా మారుతున్న విశ్వవిద్యాలయాలువిశ్వవిద్యాలయాల్లో నెలకొన్న ప్రస్తుత గందరగోళ పరిస్థితిపై డాక్టర్ శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "విశ్వవిద్యాలయాలు సమాజానికి నైతిక దిక్సూచిలా (అనీనిబఇతివనిఇవ ఐవవజూవతీబ) ఉండాలి. కానీ, నేడు వాటిని నిశ్శబ్దానికి నిలయాలుగా, బానిసత్వానికి వేదికలుగా మారుస్తున్నారు," అని ఆయన విమర్శించారు. పరిపాలనలో జరుగుతున్న లోపాలపై గొంతు ఎత్తినందుకు ఒక సీనియర్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయడం నియంతృత్వ పోకడ అని, ఇది ప్రశ్నించే తత్వాన్ని నేరంగా పరిగణించడమేనని ఆయన దుయ్యబట్టారు. విద్యా సంస్థలను "రోబోటిక్ మిషన్లు"గా మార్చవద్దని హెచ్చరించారు.

# కాంగ్రెస్ తోనే పల్లెలు గ్రామాలలో సంక్షేమ అభివృద్ధి

## 37మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేసిన మెదక్ డైనమిక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు





**నిజాంపేట,జనవరి22 (సూర్యరేఖ)** కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో రూ. 1.70 కోట్ల కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని మెదక్ డైనమిక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఎమ్మెల్యే రోహిత్ రావు మండలానికి సంబంధించి 37మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు 9మందికి సీఎంఆర్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇందిరమ్మ రాజ్యం వచ్చినాటి నుండి మహిళలు,యువకులు బాగుండాలనే ఉద్దేశంతో
సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని,నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తున్నామని తెలిపారు. అలాగే ఉచిత కరెంటు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని,గత పాలకులు ఒక్కో మనిషి మీద రెండు లక్షల రూపాయల అప్పు చేసి పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిజాంపేట మండలంలోని గ్రామాలను సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్,డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ ఎంపీడీవో రాజిరెడ్డి,ఆర్ఐ ప్రీతి, సర్పంచుల పోరం అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యక్షులు బొమ్మన మల్లేశం,మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు,మాజీ సర్పంచ్ అమర సేనారెడ్డి దేమే యాదగిరి,సర్పంచులు రామచందర్ నాయక్,బాబు నాయక్ సుశీల చల్మేటి నరేందర్,మంజుల,ఉప సర్పంచ్ రమేష్ కాంగ్రెస్ నాయకులు పంజా మహేందర్ నసీరుద్దీన్,మధుసూదన్ రెడ్డి,లక్ష్మాగౌడ్, లింగంగౌడ్ వై.వెంకటేశం మహేష్ నాగరాజు వినోద్ నాయక్,శ్రీనివాస్ నాయక్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

### హైదర్ చెరువు నీటి విడుదల..



**నిజాంపేట,జనవరి22(సూర్యరేఖ)** మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో హైదర్ చెరువు వెనుకాల గల సుమారు 300 ఎకరాల భూమి సాగు చేయడానికి వర్క్ ఇన్స్పెక్టర్ మహారాజ్,మాజీ సర్పంచ్ శ్రీరావిపల్లి అమరసేనారెడ్డి,ల ఆధ్వర్యంలో తూము వద్ద నుండి నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ నీటిని విడుదల చేయడంతో చెరువు కింద వ్యవసాయ పొలాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుమ్మరి రామచెంద్రం, వార్డ్ మెంబర్ మధు,రైతులు రవీందర్ రెడ్డి,బత్తుల రాజయ్య,గోపరి అశోక్,కనకరాజు, గొల్లచంద్రం తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన ఎంపిడిఓ రాజిరెడ్డి..



**నిజాంపేట,జనవరి22(సూర్యరేఖ)** మండల పరిధిలో నగరం గ్రామంలో నిర్మాణ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఎంపిడిఓ రాజిరెడ్డి పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్ బాబు,హౌసింగ్ ఏఈ సంధ్య,పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్,గ్రామ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధికి సహకరించాలి..



**నిజాంపేట,జనవరి22(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని 9వ వార్డులో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను కార్మికులతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు నాయిని లక్ష్మణ్ మాట్లాడుతూ...ప్రజలు తడి,పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు గ్రామం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీడి రాములుగౌడ్, శ్రీకాంత్ గౌడ్,పంపరి శివకుమార్, గ్రామపంచాయతీ పరిశుద్ధ కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

### సమాజహితంకై పహిల్వాన్ లను ప్రోత్సహించడానికే కుస్తీ పోటీలు నిర్వహించాం..





**నాంపల్లి,హైదరాబాద్,జనవరి22(సూర్యరేఖ)** శ్రీ మార్కండేయ స్వామి జన్మదినోత్సవంను పురస్కరించుకొని నిర్వహించిన ఉత్సవంలో భాగంగా 4వ శ్రీశివ మార్కండేయ రెజ్లింగ్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్ 2026 ఈనెల 19 నుంచి 21 వరకు గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని తాళ్లగడ్డ రాజలింగయ్య కబ్బడి స్టేడియంలో దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది అని ఆర్గనైజింగ్ కమిటీ తెలంగాణ హిందూ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఉత్తరపల్లి దయానంద్ అడ్వకేట్ తెలిపారు. 4వ శ్రీశివ మార్కండేయ కేసరి రెజ్లింగ్ ఛాంపియన్షిప్ 2026కుస్తీ పోటీల ఫైనల్స్ లో విజేతగా మినీ స్టేడియం రెస్లింగ్ సెంటర్ కి చెందిన సుష్మిత సింగ్ పహిల్వాన్ 70-85 కేజీల విభాగంలో 4వ శ్రీశివ మార్కండేయ కేసరి టైటిల్ ను గెలవడం జరిగిందన్నారు. 50-55 కేజీల విభాగంలో 4వ శ్రీశివ మార్కండేయ బాల్ కేసరి టైటిల్ ను మనీష్ సింగ్ పహిల్వాన్ గెలుచుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరపల్లి దయానంద్ అడ్వకేట్ మాట్లాడుతూ.. యువతలో పహిల్వాన్ లను ప్రోత్సహించడం కొరకు ఈ కుస్తీ పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టప్పాచబుత్ర ఇనిస్పెక్టర్ జి. బాలకృష్ణ,అతిధులుగా రెనోవా హాస్పిటల్స్ డా. శివకుమార్,రిటైర్డ్ డీఎస్పీ జాగారావు,మార్కండేయ భవన్ ట్రస్ట్ అధ్యక్షులు చెన్న చంద్రయ్య,శ్రీశివ మార్కండేయ స్వామి దేవాలయం అధ్యక్షులు అట్టి పాముల నర్సింగ్ రావు,కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఉత్తరపల్లి కృష్ణలు పాల్గొని విజేతలకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## 8నెలల బాలిక కడుపులోంచి బ్యాటరీని తొలగించిన గ్యాస్ట్రో హాస్పిటల్ వైద్యుడు సతీష్





**మంచిర్యాల,జనవరి22(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన బడుగు రాజేష్ గౌతమి దంపతుల కూతురు బ్లెస్సి అను ఎనిమిది నెలల బాలిక ఆడుకుంటూ బటన్ బ్యాటరీని అనుకోకుండా మింగేసింది. అది గమనించిన బ్లెస్సీ కుటుంబ సభ్యులు మంచిర్యాల పట్టణంలోని సతీష్ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్ డాక్టర్ జి. సతీష్ ని సంప్రదించగా వైద్య పరీక్షలు నిర్వహించి,ఎండోస్కోపీ ద్వారా బాలిక మింగిన బ్యాటరీని అత్యంత చాకచక్యంగా బాలిక కడుపులోనున్న బ్యాటరీని బయటకి తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ. బ్యాటరీలు కడుపులో ఉండడం వల్ల అవి ఆసిడ్ రిలీజ్ చేస్తాయని,దీని కారుణంగా కడుపులో సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఎండోస్కోపి ద్వారా బాలిక నోటి నుండి బాటరీని బయటకు తీసామన్నారు. ఇంత చిన్న బాలికకు ఇలాంటి చికత్స చేయడం మంచిర్యాలలో తొలిసారి అని అన్నారు. హైదరాబాద్ లాంటి మహా నాగరాలలో మాత్రమే చిన్న పిల్లలకు ఇలాంటి చికిత్స చేస్తారన్నారు.

## ఎమ్మెల్యే మల్లారెడ్డిపై మంత్రి కోమటి రెడ్డి వాక్యాలు అర్ధరాహిత్యం

**మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్**



**మేడ్చల్,జనవరి22 (సూర్య రేఖ)** నిరంతరం ప్రజల కోసం ఆలోచించే మనిషి మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అని మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ అన్నారు. బుధవారం అలియాబాద్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వాఖ్యలను తుడుం గణేష్ ఖండించారు. మల్లారెడ్డి చేసిన సేవలను తెలుసుకొని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడాలన్నారు. మేడ్చల్ నియోజకవర్గానికి మల్లారెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. ఎంపీగా, మంత్రిగా,ఎమ్మెల్యేగా ఉండి నియోజక వర్గ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్ల పరిష్కారానికి కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో సొంత నిధులతో రోడ్లు,గుడులు కట్టించిన ఘనుడు మల్లారెడ్డి అని కొనియాడారు. సిఎంఆర్ హాస్పటల్ మల్లారెడ్డి హాస్పటల్ పేరుతో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ఎన్నో ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో మల్లారెడ్డికి సాటి ఎవరు లేరని చెప్పారు. ఇలాంటి నాయకుడు ప్రతి నియోజకవర్గానికి ఉంటే పేద ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

### గౌడవెల్లిలో వ్యక్తి దారుణ హత్య..



**మేడ్చల్,జనవరి22(సూర్య రేఖ)** గుండ్లపోచంపల్లి సర్కిల్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో బుధవారం రాత్రి దారుణం జరిగింది. గౌడవెల్లిలోని హనుమాన్ ఆలయం సమీపంలో నివసిస్తున్న గోమారం లక్ష్మారెడ్డి (42) దారుణంగా హత్య చేయబడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు లక్ష్మారెడ్డి తన ఇంట్లో అద్దెకుంటున్న మలిగ లింగం (50),వృత్తిరీత్యా గొర్రెల కాపరితో కలిసి మంగళవారం రాత్రి మద్యం సేవించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యతలెత్తిన వాగ్వాదం క్రమంగా ఘర్షణకు దారి తీసినట్లు తెలిపారు. గొడవ తీవ్రత పెరగడంతో నిందితుడు మలిగ లింగం గొడ్డలితో లక్ష్మారెడ్డి తలపై దాడి చేయగా తీవ్ర గాయాల పాలైన లక్ష్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

# కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుస్తాం

**జనసేన కోఆర్డినేటర్ మచ్చ సుధాకర్**

**కామారెడ్డి,జనవరి22(సూర్యరేఖ)**రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంటామని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ మచ్చ సుధాకర్ తెలిపారు. ఆయన గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశానికి హాజరై మాట్లాడారు.గురువారం జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ధన బలంతో కాదు,ప్రజా బలంతో గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు.ఈ సందర్భంగా పోటీ చేసే అభ్యర్థుల వివరాలు తెలిపారు.కామారెడ్డి జిల్లా క్రీడా అధ్యక్షుడు నర్సాగౌడ్ 8వ వార్డు,9వ వార్డ్ కోల శరత్ కుమార్, శ్రీకాంత్ 46వ వార్డు, దివ్య,14వ వార్డులుగా పోటీ చేయడానికి దరఖాస్తు



చేశారు.పలు వార్డుల్లో పోటీ చేయనున్న కౌన్సిలర్ అభ్యర్థులతో చర్చించారు. జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి తెలంగాణపై ప్రత్యేక అభిమానం ఉందని ఆయన అన్నారు.కొండగట్టు అంజన్న ఆశీర్వాదంతో తెలంగాణలో జనసేన పార్టీ రెపరెపలాడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేసే పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆయన జనసేన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు ఆరంభం మాత్రమేనని



రాబోయే జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల్లో కూడా జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన పార్టీ బలోపేతం,దిశగా గెలుపు దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజనులకు సొంత భవనం





**త్వరలోనే అందుబాటులోకి రానున్న భవనం..**

**ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి చొరవ..**

**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)**ఉప్పల్‌లో సీనియర్ సిటిజన్లకు సొంత భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది.ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి చొరవతో సుమారు 350 గజాలలో ప్రధాన రహదారి పక్కన భవన నిర్మాణం చేపట్టారు.పనులు తుది దశకు చేరుకున్నాయి.అందరికీ అందుబాటులో ఉండే విధంగా పీవీటీ మాల్ సమీపంలోనే ఈ భవన నిర్మాణం చేపట్టడం జరిగింది.ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి సీనియర్ సిటిజన్స్ భవనాన్ని పలువురు సీనియర్ సిటిజన్లతో కలిసి సందర్శించారు. సీనియర్ సిటిజన్లకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను భవనంలో కల్పించనున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.సీనియర్ సిటిజన్ల మీద ఉన్న గౌరవంతోనే ప్రధాన రహదారి పక్కన రూ.కోట్ల విలువైన స్థలంలో రూ.28 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించినట్టుగా చెప్పారు.ప్రతి సీనియర్ సిటిజన్‌కు అన్ని వేళలా అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏ.ఈ. రాజ్ కుమార్,శమీర్పేట్ యాదిరెడ్డి వాకిటి బుచ్చి రెడ్డి వెంకటయ్యగౌడ్ మేకల వెంకట్ రెడ్డి మేకల రామ్ రెడ్డి నారాయణగౌడ్ లింగరెడ్డి పి.వెంకటేశం సల్లా మల్లరెడ్డి,మందుముల అంజిరెడ్డి,వెంకట స్వామి మాణిక్యం రాములు,షేర్ నరసింహ రెడ్డి పాపి రెడ్డి సి.మనోహర్ జి.అంజిరెడ్డి కోటేశ్వర్ రావు తుమల్ల దేవిరెడ్డి,లింగంపల్లి రామకృష్ణ,ఈగ ఆంజనేయులు సల్లా ప్రభాకర్ రెడ్డి,రామరావు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకానగర్ లో ఘనంగా శ్రీమార్కండేయ దేవాలయంలో శ్రీభక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు



**ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** చిల్కానగర్‌లోని శ్రీమార్కండేయ దేవాలయంలో గురువారం శ్రీభక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం చిల్కానగర్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు జరిగాయి. చాలా సంవత్సరాల తర్వాత మార్కండేయ దేవాలయాన్ని సుందరంగా అలంకరించి,భక్తుల మనసులను ఆకట్టుకునే విధంగా జయంతి వేడుకలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఉదయం 7గంటల నుంచే అభిషేకాలు,అర్చనలు, ప్రత్యేక పూజలతో కార్యక్రమం ప్రారంభమై, మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆసీనులైన శ్రీభక్త మార్కండేయ స్వామికి విశేష పూజలు చేశారు.ఈ పవిత్ర కార్యక్రమానికి సుమారు 300 మంది భక్తులు, పద్మశాలి కుల బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై జయంతి



వేడుకలను భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్, బి.సి ఉద్యమ నేత తాడూరి శ్రీనివాస్,లతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు,స్థానిక గ్రామ కుల పెద్దలు,యువజన సంఘాల నాయకులు,విశేష సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. తాను తొలిసారిగా మార్కండేయ దేవాలయాన్ని సందర్శించినట్లు శ్రీభక్త మార్కండేయ స్వామి కృపా కటాక్షాలు తనపై మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైనందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ,స్థానిక పద్మశాలి సంఘం విజ్ఞప్తి మేరకు మార్కండేయ దేవాలయంలో ఖాళీ స్థలంలో పైకప్పు రేకులతో పూర్తిస్థాయి పనులు చేపట్టి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం సంగీశెట్టి శ్రీధర్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ



ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం చిల్కానగర్ కమిటీ అధ్యక్షులు సకినాల ప్రసాద్,ప్రధాన కార్యదర్శి బెజగం శ్రీనివాస్ కోశాధికారి శ్రీపెండెం నాగార్జున ముఖ్యసలహాదారులు దేవసాని బాలచందర్,గూడ శ్రీశైలం దాసరి శ్రీనివాస్,బోడ విద్యాసాగర్ వడ్డేపల్లి కిషోర్,సంగీశెట్టి శ్రీధర్, బసాపతి చంద్రశేఖర్,తాళ్ల శ్రీనివాస్, అడ్డగట్ల భావానందం బడుగు రాములు, డాక్టర్ రాజు సుల్తాన్ జగన్నాథం బోడ అశోక్ కుమార్,చిన్నం నవీన్ తాటి సంపత్,పెద్ద బొమ్మ రమేష్ ,పాగాల వినయ్ దేశిడి శ్రీనివాస్,సకినాల చందు,సబ్బని సతీష్ యువనేత పాము రాజేష్,గుంజరి కుమార్ దేవసాని వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్దే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తా..

**వార్డు సభ్యుడు గోదా అరుణ్ యాదవ్**



**ములుగు,జనవరి22(సూర్యరేఖ)** కొక్కొండ గ్రామంలోని 1వ వార్డు అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని 1వ వార్డు సభ్యుడు గోదా అరుణ్ యాదవ్ అన్నారు.గురువారం వార్డులో రూ.5లక్షల నిధుల వ్యయంతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా అరుణ్ యాదవ్ మాట్లాడుతూ...వార్డు పరిధిలోని ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తోడ్పాటును అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లు జ్యోతి,వార్డు సభ్యులు బద్రి భారత్ యాదవ్,ప్రభు,విక్రమ్,బండమీది నరసింహులు,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ నాయకులు వాసుగౌడ్,బంగ్లా గణేష్,పుట్టి లింగం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్,కార్పొరేషన్ ఎన్నికలకు బీజేపీ ఇన్ఛార్జ్ లు,మేము సిద్ధం

**బోహిని దర్శన్**



**నాంపల్లి,హైదరాబాద్,జనవరి22 (సూర్యరేఖ)** తెలంగాణలో రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ ఎన్నికల ఇన్ఛార్జ్లను నియమించిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోహిని దర్శన్ తెలిపారు.ఈ సందర్భం గా బోహిని దర్శన్ మాట్లాడుతూ...బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఆదేశాల మేరకు ఈ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించేందుకు ఎన్నికల ఇన్ఛార్జ్ గా మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ ఎన్నికల కోఇన్ఛార్జు గా రాజస్థాన్ రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షులు అశోక్ పర్నామి,రాజ్యసభ ఎంపీ రేఖశర్మలను నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.వీరిని ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించేందుకు నియమించారని బోహిని దర్శన్ పేర్కొన్నారు.వీరి నాయకత్వంలో భాజపా తప్పకుండా చారిత్రక విజయాన్ని సాధిస్తుందని నాకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.ఈ కీలక పోరాటంలో భారతీయ జనతా పార్టీ విజయం కోసం నేను,మన పార్టీ శ్రేణులతో సంపూర్ణ శక్తితో పాల్గొని కృషి చేస్తానని అన్నారు. సంఘటనా బలం,కార్యకర్తల ఉత్సాహం ప్రజల విశ్వాసంతో కమలాన్ని మరింతగా వికసింపజేయడానికి మేము కట్టుబడి ఉన్నామని బోహిని దర్శన్ తెలియజేశారు.

## అంసన్ పల్లి గ్రామంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం..



**కొల్చారం,జనవరి22(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసన్ పల్లి గ్రామంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచితం పశువైద్య శిభిరం గ్రామ సర్పంచ్ కన్నెబోయిన గీత రమేష్,జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ వెంకటయ్య ఉచిత గర్భకోశ నివారణ శిబిరం ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ...పాడి పశువులలో గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేయించాలని, సకాలంలో చూడికట్టేలా చూసుకోవాలన్నారు.పాడి పశువు ఈనిన తర్వాత 90 రోజుల ఎద లక్షణాలను గుర్తించి గోపాలమిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సెక్స్ సాటర్డే సెమెన్ ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించడం వలన 90శాతం ఆడదూడలు జన్మిస్తాయని తెలిపారు.మేలు జాతి లేగ దూడలు జన్మించడం వలన పాడి రైతులు లాభం పడతారని, పుట్టిన లేగ దూడలకు 15రోజుల తర్వాత నుండి ఆరు నెలల వరకు నట్టల నివారణ మందులు తాగించాలన్నారు.కార్యక్రమంలో రంగంపేట్ పశువైద్య అధికారి డాక్టర్ ప్రియాంక ఎల్ .ఎస్. ఏ చెన్నయ్య,విఎ కీర్తి,మెదక్ జిల్లా గోపాల మిత్ర సూపర్ వైజర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి,గోపాల మిత్రులు మానయ్య, శ్రీకాంత్,ప్రవీణ్,సిబ్బంది మైపాల్,వెంకటేశం, చంద్రశేఖర్, ఉపసర్పంచ్ మన్య నాగరాజ్,వార్డ్ మెంబర్లు సురేష్,శ్రీనివాస్ గౌడ్,షేకులు బోయిని మధు,గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

# దోమల నుండి ప్రజలను కాపాడే బాధ్యత మనదే





**ఎంటమాలజీ డిపార్ట్మెంట్ సహకరించండి..**

**కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్**

**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్,జిహెచ్ఎంసి ఎంటమాలజీ డిపార్ట్మెంట్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిబ్బందితో కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ హైకోర్టుకాలనీ నాచారం చెరువులో గుర్రపు డెక్కను సమయానుసారం తొలగించకపోవడం వల్ల దోమల తీవ్రత చాలా ఎక్కువ అయినదని తెలిపారు.ఎంటమాలజీ డిపార్ట్మెంట్ ఈ విషయాన్ని సీరియస్ గా పరిగణించి క్రమం తప్పకుండా సిబ్బంది ఆంటీ లార్వా పిచికారిని, చెరువులో పరిసర ప్రాంతాల్లో పిచికారి చేయాలని, సాయంకాలం ఫాగింగ్ సిబ్బంది షెడ్యూల్ ప్రకారంగా చిల్కానగర్ డివిజన్లోని అన్ని కాలనీలు బస్తీలలో ఫాగింగ్ ని తప్పనిసరిగా చేయాలని సూచించారు. గుర్రపు డెక్కను చెరువులో నుంచి తొలగించేంతవరకు విశ్రాంతి తీసుకోకుండా దోమలపై యుద్ధం ప్రకటించాలని ప్రజలను కాపాడే బాధ్యత మన అందరిది అని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వీలైనంతవరకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సహకరించాలని వారిని విజ్ఞప్తి చేయడం జరిగింది.జోనల్ కమిషనర్ రాధిక గుప్తా వీలైనంత తొందరలో చెరువులోని గుర్రపు డెక్కను తీయించే ఏర్పాటు చేస్తానని హామీ వచ్చారని మరొక్కసారి గుర్తు చేశారు.కార్యక్రమంలో ఎంటమాలజీ డిపార్ట్మెంట్ సూపర్వైజర్లు అజయ్, మహేందర్,సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్లంపేటలో ఘనంగా మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం





**మేడ్చల్,జనవరి22(సూర్యరేఖ)** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఎల్లంపేట వార్డు మాజీ ఎంపీటీసీ సలేంద్రకుమార్ నివాసంలో నిర్వహించిన మల్లన్న స్వామి కళ్యాణం మహోత్సవ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఊదండపురం సత్యనారాయణ మాజీ సర్పంచ్ విజయానందరెడ్డి రామకృష్ణుడు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివశంకర్ సీనియర్ నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్,రామన్నగారి సంతోష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కందుల కుమార్,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్,ఎన్ఎస్ యుఐ జనరల్ సెక్రెటరీ మామిండ్ల రాహుల్ యాదవ్,నాయకులు మరిగల బాబురావు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ ఎన్ఎస్ యుఐ అద్యక్షులు శ్రీధర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# మా భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించండి

**రెవెన్యూ అధికారులకు రైతుల మొర..**

**ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన పాస్ పుస్తకాలు ధరణిలో రద్దు చేశారని ఆరోపణ..**



**ఖమ్మం,జనవరి22(సూర్యరేఖ)** గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా తమ భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ కల్లూరు మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన రైతులు గురువారం తాహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.విశ్వనాథపురం గ్రామ సమీపంలోని ముచ్చవరం రెవిన్యూలో ఉన్న అసైన్మెంట్ భూమి సర్వే నెంబర్ 3 లో20 ఎకరాల భూమిని 26 మంది రైతులు గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని,ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తమకు పాస్ పుస్తకాల ఇప్పించారని రైతులు తెలిపారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి అమలులోకి వచ్చిన తర్వాత తమ పాస్ పుస్తకాలు రద్దు చేశారని,కొత్త పుస్తకాలు ఇవ్వకుండ తమను రెవెన్యూ అధికారులు ఆఫీసులో చుట్టూ తిప్పించుకున్నారని బాధిత రైతులు పసుపులేటి వెంకటేశ్వరరావు,గరిక నరసయ్య,ఇండ్ల రాంబాయీ పసుపులేటి సత్యనారాయణ,అంగడి భద్రయ్య,లు వాపోయారు ధరణి వచ్చిన తర్వాత తమ సర్వే నెంబర్ 3లో ఖాళీ లేదని తమ పేర్లు రెవిన్యూ రికార్డు నుండి నుండి తొలగించారని రైతులు ఆరోపించారు.సర్వే నెంబరు 3ను అదే గ్రామానికి చెందిన కొంతమంది భూమిలేని రైతులకు కేటాయించి పాస్ పుస్తకాలు ఇచ్చారని బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. భూమిలేకున్నప్పటికీ కేవలం సర్వేనెంబర్తో పాస్ పుస్తకాలు పొంది గత 12 ఏళ్లుగా ప్రభుత్వం నుండి అక్రమంగా రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలు పొందుతున్నారని రైతులు ఆరోపించారు. సర్వే నెంబర్ 3 లోగల 20ఎకరాల భూమిని 26మంది రైతులు ఎటువంటి పాస్ పుస్తకాలు లేకుండా, ప్రభుత్వంలో నీటి ప్రతిఫలము పొందకుండా సాగు చేసుకుంటున్నామని రైతులు చెప్పారు.తక్షణమే తమ సమస్యను పరిష్కరించాలని రైతులు తాహసిల్దార్,సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అంగడి భద్రయ్య,రాయప్పలు పాల్గొన్నారు.

## కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో అభ్యర్థుల కోసం వేట..



**ఖమ్మం,జనవరి22(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాలలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల కోసం సర్వేలతో వేట ప్రారంభించారు.గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు గత రెండు రోజులుగా సర్వేలు ముమ్మరం చేశాయి.ఓటర్ల జాబితా ప్రకారం వార్డుల ప్రకారం రిజర్వేషన్లను ప్రాతిపదికన సర్వేలు ప్రధాన పార్టీలు ముమ్మరం చేశాయి.ఒక్కో పార్టీ ఆరుగురు నుంచి పదిమందిని పేర్లు ఎంపిక చేసి నగదు,ప్రజాబలం ఉన్న వారిని ఎంపిక చేసేందుకు ప్రధాన పార్టీలు ప్రత్యేక శ్రద్ధ వహించుతున్నాయి.మున్సిపాలిటీలో 20 వార్డుల్లో ప్రజల మధ్య ప్రజలతో ఉంటూ ప్రజాబలం కలిగిన వారిని ఆర్థిక బలం కలిగిన వారిని ఒక్కో పార్టీ ఆరుగురు నుంచి పదిమందిని ఎంపిక చేసి,సర్వే గత కొద్ది రోజులుగా నిర్వహిస్తూ ఈ సర్వేలను ఆధారంగా చేసుకొని అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రక్రియ పూర్తి కావచ్చింది.ఆశావహులు ప్రధాన పార్టీ నేతల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.ఎవరికి వారే ప్రధాన అనుచరుల నుంచి పైరవీలు ఆశావహులు చేస్తున్నారు డబ్బు ఉందా.? ప్రజాబలం ఉందా.? అయితే నీకే టిక్కెట్టు అంటూ ప్రచారం మొదలైంది. గెలుపు గుర్రాలకే బిఫామ్ అంటూ కాంగ్రెస్ లో ప్రస్తుత ఎమ్మెల్యే బిఆర్ఎస్ లో మాజీ ఎమ్మెల్యే,ప్రధాన పార్టీల నుంచి ప్రచారాలు ఆయా వర్గాలనుంచి చర్చలు ప్రారంభమయ్యాయి. ఏది ఏమైనప్పటికీ గెలుపు గుర్రాలకే సర్వేలు ఆధారంగా ప్రజాబలం, ఆర్థిక బలం ఉన్నవారికి టిక్కెట్లు ఇస్తామని ప్రధాన పార్టీలు నిర్ణయించాయి

## రైతు కార్డు ద్వారా యూరియా పంపిణీ..

**మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి**



**నిజాంపేట,జనవరి22(సూర్యరేఖ)** రైతులకు యూరియా కష్టాలు లేకుండా రైతు కార్డు ద్వారా బస్తాలను పంపిణీ చేస్తున్నట్లు నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి తెలిపారు.గురువారం సబ్ మార్కెట్ యార్డులో రైతులకు యూరియా అందజేశారు.రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని,ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు.రైతులు పంటలకు మోతాదుకు మించి యూరియా వాడొద్దని,అధికంగా వాడితే పంటలు తెగుళ్ల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీలత,రమ్య,సొసైటీ సీఈఓ శోభారాణి,ఆపరేటర్ మహిపాల్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట.!

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన పరమేశ్వర్ రెడ్డి,కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి,రజిత పరమేశ్వర్ రెడ్డి,లు**



**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన నడుస్తోందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజా పాలనలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద ఉప్పల్ నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు 175 కుట్టు మిషన్లు మంజూరు అయ్యాయి.ఉప్పల్ డివిజన్ వార్డ్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఉప్పల్ నియోజకవర్గంలోని మైనార్టీ వర్గాల మహిళలకు ఈ కుట్టు మిషన్లు అందజేస్తున్నామని తెలిపారు.ఈ పథకం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందడంతో పాటు స్వయం ఉపాధికి అవకాశాలు ఏర్పడతాయని,ముఖ్యంగా నిరుద్యోగ మహిళలు దీని ద్వారా ఎక్కువగా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.ప్రభుత్వం పేద వర్గాల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉందని అన్నారు.కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ఉప్పల్ వార్డు పునఃవిభజన అక్రమాలపై హైకోర్టు కీలక ఆదేశాలు.!

**ఉప్పల్ ప్రజల గోడు ఉన్నత న్యాయస్థానం ముందుకు.**



**ఉప్పల్,జనవరి22 (సూర్యరేఖ)**జిహెచ్ఎంసి 150 నుంచి ఓఆర్ఆర్ వరకు 300 వార్డులుగా విస్తరణ,ఉప్పల్ వార్డు అక్రమ డెలిమిటేషన్ రిట్ పిటిషన్ పై గురువారం తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. ప్రాథమిక నోటిఫికేషన్ (డిసె.9)లో ఉప్పల్ చిన్న ప్రాంతంగా,విభజించి చూపించారు.చివరి గజెట్ నోటిఫికేషన్ (డిసె.25)లో ఇతర ప్రాంతాలను జోడించి జనాభా 65,000-70,000కి పెంచి పెద్ద వార్డుగా ప్రకటించిన విషయాన్ని న్యాయ స్థానం దృష్టికి తీసుకెళ్లిన పిటిషనర్ తరపున న్యాయవాది. చిల్కానగర్,బీరప్పగడ్డ డివిజన్లు 25-32 వేలు మాత్రమే ఉన్నాయని,న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.పిటిషనర్ అడ్వకేట్ ఒక ఓటు-ఒక విలువ' సూత్రం,మెరుగైన పాలన కోసం డెలిమిటేషన్ జిహెచ్ఎంసి చట్టం రూల్ 5 (10 శాతం జనాభా వేరియన్స్),రూల్ 8(క్లెయిమ్స్&ఆబ్జెక్షన్స్) ఉల్లంఘన. ప్రాథమిక నోటిఫికేషన్ అనుకూలంగా ఉండటంతో ఆక్షనలు దాఖలు చేయలేదు.అంతలోనే ఈ అశాస్త్రీయ మార్పు అన్యాయమని న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలశెట్టి వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం జిహెచ్ఎంసి వార్డుల 23,24,28 పూర్తి జనాభా వివరాలు (ప్రస్తుత+ భవిష్యత్ పెరుగుదల,ఉప్పల్ బాగాయత్ వేగవృద్ధి) సమర్పించాలి.వార్డుల జనాభా, సరిహద్దులు మరియు ఏఅంశం ప్రాతిపదికన 16 రోజుల్లోనే ఈనిర్ణయానికి వచ్చారో కౌంటర్ ఫైల్ చేయాలని ప్రభుత్వాన్నికి ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కోరికలు,సొంత ప్రయోజనాలతో కాకుండా నియమాలు పాటించాలని న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు.కేసు ఫిబ్రవరి 13,2026కి వాయిదా పడింది.

# మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంత ప్రజల భద్రత కోసం కీలక అడుగు"





**నెమలి అనిల్ కుమార్**

**ఉప్పల్,జనవరి22 (సూర్యరేఖ)** మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో మాణిక్చంద్ రోడ్ నుంచి నాచారం రోడ్ వరకు సరైన వీధి దీపాలు లేకపోవడం వల్ల కార్మికులు,ఉద్యోగులు,స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి అనిల్ పేర్కొన్నారు.ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో నెమలి అనిల్ ఆధ్వర్యంలో గురువారం ఐలా కమిషనర్ ఏ.ప్రభాకర్,ఐలా మేనేజర్ విజయ్ కుమార్,లను కలిసి,కొత్త వీధి దీపాల ఏర్పాటు కోసం అధికారిక రిప్రెజెంటేషన్ అందజేశారు.ఈ సందర్భంగా మాణిక్చంద్ రోడ్‌శాహీ ఎక్స్‌పోర్ట్స్ రహేజా విస్టాస్‌నాచారం ఎక్స్ రోడ్స్ వరకు సరైన లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి వేళ ప్రమాదాలు, భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.కార్మికుల భద్రత,ప్రజల రక్షణతో పాటు పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి దృష్ట్యా తక్షణమే వీధి దీపాల ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్,ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని పూర్తి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ మాట్లాడుతూ..."ప్రజల సమస్యలపై కేవలం మాటలకే పరిమితం కాకుండా, అధికారుల వద్దకు తీసుకెళ్లి పరిష్కారం వచ్చే వరకు పోరాటం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం..మల్లాపూర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది"అని తెలిపారు.

# మహిళా మండలి భవనం మహిళలకే ఉండాలి

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇవ్వవద్దు..**

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అవసరమైతే ఈ సేవా కార్యాలయాన్ని ఇవ్వండి..**



**రాజేంద్రనగర్,జనవరి22(ఆంధ్రజ్యోతి)** రాజేంద్రనగర్ లోని శ్రీవెంకటేశ్వర మహిళా మండలి భవనాన్ని మహిళల కోసమే కేటాయించాలని మహిళా మండలి అధ్యక్షురాలు దుంబాల ఝాన్సీ ఉమారెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పి ఉమామహేశ్వరి మహిళా సంఘం నేతలు మంజుల, రజియా డిమాండ్ చేశారు.మహిళా మండలి భవనాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇస్తామనడం మంచిది కాదన్నారు. గ్రామపంచాయతీలుగా ఉన్న కాలం నుంచి ప్రస్తుతం ఉన్న భవనం మహిళా మండలి భవనేమే అని గుర్తు చేశారు.ప్రేమావతి పేట్ సర్పంచ్ గా పనిచేసిన బాల్ రెడ్డి తన హయాంలో ఇక్కడ భవనాన్ని నిర్మించగా, అది శిథిలావస్థకు చేరుకుందన్నారు. అలా శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని మహిళా సంఘం నేతలు బషీరా రహమాన్,ఎం.యాదమ్మ యాదవ్,లు పోరాడి మహిళా భవనం స్థలాన్ని కాపాడరన్నారు. ఆ స్థలంలో మాజీ కార్పొరేటర్ దివంగత జాలిగం సత్యనారాయణ కృషితో రూ.20 లక్షలు కేటాయించి మహిళా భవనం నిర్మించుకోవడం జరిగిందన్నారు. అందులో అప్పటి వార్డ్ మెంబర్ ఎ.మాధవి నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు,అనేకమంది సహకారం అందజేశారని గుర్తు చేశారు.కొన్ని కారణాలవల్ల మహిళా భవనాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు తీసుకున్నారని,ఆ తర్వాత వార్డు కార్యాలయం పెట్టారని అన్నారు.ప్రస్తుతం ఆ భవనాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇస్తామనడంలో అర్థం లేదన్నారు.ఈ విషయంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాష్,లు కల్పించుకొని మహిళల కోసం నిర్మించుకున్న భవనాన్ని మహిళా మండలికే ఉండేటట్లు చూడాలన్నారు.లేకపోతే వారిని మహిళా లోకం క్షమించదని గుర్తు చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు.

## త్వరలో వెంకటసాయినగర్ లో కల్వర్టు పనులు ప్రారంభం..

**తొలగనున్న వెంకట్ సాయినగర్ వాసుల కష్టాలు..**



**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ పరిధిలోని వెంకట్ సాయినగర్‌లో నూతనంగా కల్వర్టు నిర్మాణ పనులను రానున్న రెండుమూడు రోజుల్లో ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు తెలిపారు.గత నెలలో రూ.34.50 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరైనప్పటికీ,కొన్ని సాంకేతిక కారణాల వల్ల పనులు ప్రారంభించలేకపోయామని, ఆ సమస్యలు పరిష్కారమైందున త్వరలోనే పనులు మొదలుపెట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ గోధుమల రాజు మాట్లాడుతూ...కాలనీ వాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో కల్వర్టు నిర్మాణానికి కూడా త్వరలోనే అనుమతులు తీసుకొని పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.వినీల్ గౌడ్, ఏ.ఈ.శ్వేత, వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్,బీజేపీ మహిళా నాయకురాలు కీర్తి ముదిరాజ్‌తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ..

**రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్**



**ఉప్పల్,జనవరి22 (సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద రామంతపూర్ డివిజన్ మహిళలకు 20కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. రామంతపూర్ గాంధీనగర్ కమిటీ హాల్ దగ్గర ఏర్పాటు చేసి రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్ కుట్టు మిషన్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహ్మద్ రఫీక్ మాట్లాడుతూ. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో రామంతపూర్ డివిజన్ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రామంతపూర్ డివిజన్ కు ఈ పథకం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలు పొందుతుండడంతో పాటు స్వయం ఉపాధి,తన కుటుంబంపై భారం పడకుండా ప్రతి మహిళ భర్తతో సమానం స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. నిరుద్యోగ మహిళలు ఎక్కువగా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామంత పూర్ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి ఇంద్రమ్మ కమిటీ మెంబర్ గాయత్రిగౌడ్, తబస్సుం బేగం,మొగిలి లింగం,ఎండీ షకీల్ జిలాని, అన్వర్ సాదిక్,తదితరులు పాల్గొన్నారు.

## మూడు లక్షల ఎల్‌ఓసి పత్రాన్ని విజయ్ వారణాసి కుటుంబానికి అందజేసిన పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్ డివిజన్ వివేక్ నగర్ కాలనీకి చెందిన విజయ్ వారణాసి బ్రెయిన్ సర్జరీ నిమిత్తం రూ.3లక్షల ఎల్‌ఓసిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు. విషయాన్ని ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్,పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.పేదల కష్టాల్లో తోడుంటూ, ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందిస్తున్న పరమేశ్వర్ రెడ్డి,ఆకారపు అరుణ్,లకు విజయ్ వారణాసి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...పేదల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి మారిందని అన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ పేదవారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వీలైనంత త్వరలో చెక్కులు ఎల్‌ఓసిలు మంజూరు అవుతున్నాయని ఆయన తెలిపారు.

# బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సొంత నిధులతో ఉప్పల్ లో ఫాగ్గింగ్

దోమల బాధ నుంచి ప్రజలకు విముక్తి కోసం ప్రయత్నం..

ఫాగ్గింగ్ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** ఉప్పల్ లో దోమలు విపరీతంగా పెరిగి,ప్రజలను ఇబ్బంది పెడుతున్న దోమల సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత పూడూరి జితేందర్ రెడ్డి (ఉప్పల్ పీజేఆర్) తన వంతు ప్రయత్నాన్ని ప్రారంభించారు.దోమల నివారణ కోసం సొంతంగా ఫాగ్గింగ్ మెషిన్ ను అందుబాటులోకి తెచ్చారు.ఈ వాహనాన్ని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు.ప్రజల ఇబ్బందులను గుర్తించి, సొంతంగా పరిష్కరించేందుకు ఫాగ్గింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అని అన్నారు.ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ...ఉప్పల్ డివిజన్ ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,దోమల నివారణకు డివిజన్ లోని కాలనీలు,బస్తీల్లో ప్రతి రోజు ఫాగ్గింగ్ చేపడతామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవా స్పూర్తితో ఈ కార్యక్రమానికి శ్రీకారం చూడుతున్నానని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు,మహిళా నేతలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యత సాధించాలి..



**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ)** విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని మండలంలోని సర్పంచులు పెంచాల మధు నెండుగురి పున్నం,సెగ్గం వెంకటేష్ సుంకరి దివ్య,లు కోరారు. మండలంలోని పొన్నారంలో సీఎం కప్-2026 క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలను గురువారం వారు ప్రారంభించి మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా ప్రతిభకు అపార అవకాశాలు ఉన్నాయని అన్నారు.విద్యార్థులు క్రీడలను కేవలం పోటీలుగా కాకుండా,ఆరోగ్యకరమైన జీవన విధానంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే చదువుతోపాటు వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు.క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని విద్యార్థులు క్రీడల్లో రాణించి గ్రామానికి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.క్రీడల ద్వారా క్రమశిక్షణ,సహనం,జట్టు భావన పెంపొందుతాయని,గ్రామ పంచాయతీ తరపున క్రీడా సౌకర్యాల మెరుగుదలకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు విద్యతో పాటు క్రీడలు సమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని,క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన మండల జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక వ్వాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎచ్ఎం రాఫెల్ రెడ్డి,పీడీ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు(పిఈటీ) రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షులు ఈద లింగయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చేపలు పట్టుటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి ..

కొల్చారం ఎస్ఐ మొహమ్మద్ మోయినుద్దిన్



**కొల్చారం,జనవరి22(సూర్యరేఖ)** కౌడిపల్లి మండలంలోని భుజరంపేట గ్రామానికి చెందిన గట్టు మీది పాండరి ఎనిగండ్ల గ్రామ శివారులోని మంజీర నది ఎల్లమ్మ గుడి చెక్ డ్యామ్ వద్ద చేపలు పట్టుటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు కొల్చారం ఎస్సై మొహమ్మద్ మోహినుద్దీన్ తెలిపారు.

# కేటీఆర్ సమక్షంలో భారాసాలో చేరిన పొన్నం హరీష్



**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ)** రానున్న ఎన్నికల్లో భారతీయ రాష్ట్ర సమితి పార్టీ గెలుపు కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని మందమర్రి పట్టణ యూత్ నాయకుడు పొన్నం హరీష్ స్పష్టం చేశారు.బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో ఆయన అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కేటీఆర్ హరీష్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. మందమర్రి పట్టణానికి చెందిన యూత్ నాయకుడిగా గుర్తింపు పొందిన పొన్నం హరీష్ డాక్టర్ రాజారమేష్ ముఖ్య అనుచరుడిగా రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో జనసేన పార్టీ మాజీ పార్లమెంట్ కమిటీ మెంబర్‌గా పనిచేసిన ఆయన అసెంబ్లీ ఎన్నికల ముందు డాక్టర్ రాజారమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.అయితే ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో రాజారమేష్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.అనంతరం అసెంబ్లీ ఎన్నికల ముందు రాజారమేష్ బారాసా పార్టీలో చేరగా హరీష్ బారాసాకు మద్దతుగా రాజారమేష్ ముఖ్యఅనుచరుడిగా కొనసాగారు. ఎట్టకేలకు బుధవారం బాల్క సుమన్ డాక్టర్ రాజారమేష్ ఆధ్వర్యంలో పొన్నం హరీష్ అధికారికంగా భారాసా పార్టీలో చేరారు.యూత్‌లో మంచి పట్టున్న నాయకుడిగా మందమర్రి పట్టణ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న హరీష్ చేరికతో భారాసా పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భారాసా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్,డాక్టర్ రాజారమేష్ తో పాటు బారాసా పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూముల రీసర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్మోహన్



**సదాశివనగర్,జనవరి22(సూర్యరేఖ)**గాంధారి మండలం చెన్నాపూర్ గ్రామంలో భూభారతి చట్టం కింద చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ పాల్గొన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా చెన్నాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి,గ్రామ పరిధిలోని మొత్తం 506ఎకరాల భూములను రీసర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...భూభారతి చట్టం ద్వారా రైతుల భూములకు సంబంధించిన గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ,నిజమైన భూయజమానుల పేర్లను అధికారికంగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.గత ప్రభుత్వ కాలంలో ధరణి పోర్టల్ అమలుతో అనేక మంది రైతులు భూములు కోల్పోయారని,తప్పుడు సర్వే నంబర్ల కారణంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందలేని పరిస్థితులు ఎదురయ్యాయని విమర్శించారు. భూముల సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎంఆర్ఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ధరణి వ్యవస్థలోని లోపాలు,రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అసెంబ్లీలో ప్రస్తావించడమే కాకుండా, ఎల్లారెడ్డి నియోజకవర్గ రైతుల భూసమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,లకు వివరించినట్లు తెలిపారు.స్పందించిన ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా ప్రతీ రైతు భూమిని రీసర్వే చేయాలని నిర్ణయించడంతో పైలట్ ప్రాజెక్ట్‌గా చెన్నాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు.ఈ కీలక నిర్ణయానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,లకు ఎమ్మెల్యే మదన్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యేక అధికారి ఆశ్రమ పాఠశాల తనిఖీ






**ఖమ్మం,జనవరి22(సూర్యరేఖ)** మండల ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత గురువారం గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికల ఉన్నత పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పరిసరాలు పరిశుభ్రత,విద్యాభివృద్ధి బాలికలకు ప్రత్యేక తరగతులు వ్యక్తిగత పరిశుభ్రతపై తనిఖీలు, సలహాలు సూచనలు చేశారు.పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసు విద్యార్థిని విద్యార్థులు,ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పోటీతో మారుతున్న రాజకీయ సమీకరణాలు..




**సదాశివానగర్,జనవరి22(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా 4మున్సిపాలిటీలో జనసేన పార్టీ పోటీ చేస్తుండటంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ నాయకులకు పవన్ కళ్యాణ్ కొండగట్టు వచ్చిన సందర్భంగా దిశ నిర్దేశం చేశారు.అందులో భాగంగానే కామారెడ్డి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలో జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీలో ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష పార్టీలైన భారత రాష్ట్ర సమితి,భారతీయ జనతా పార్టీలకు షాక్ తగిలేటట్టుంది.జనసేన పార్టీకి కామారెడ్డి బిచ్కుంద, బాన్సువాడ,ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో జనసేన పార్టీకి మంచి క్యాడర్ ఉంది.దీంతో మున్సిపల్ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ ఏర్పడే అవకాశం ఉంది. మొన్నటిదాకా అధికార కాంగ్రెస్ పార్టీ,ప్రతిపక్ష పార్టీలైన భారత రాష్ట్ర సమితి,భారతీయ జనతా పార్టీలు పోటీ చేస్తాం అనుకున్నాయి.అనుకోకుండా జనసేన పార్టీ పోటీలో ఉండడంతో ఏ పార్టీకి గండి పడుతుందో అని అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.ఏది ఏమైనా యువత మార్పు కోరితే మాత్రం జనసేన పార్టీకి ఆశించిన ఫలితాలు వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా.

## అందరి చూపు జనసేన వైపు..




**కామారెడ్డి,జనవరి22(సూర్యరేఖ)** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అందరి చూపు జనసేన పార్టీ వైపు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. గురువారం వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి జనసేన అధినేత 21స్థానాల్లో పోటీ చేస్తే 21స్థానాల్లో గెలుపొంది రికార్డు సృష్టించాడు. సామాన్య వ్యక్తులకు టికెట్ ఇచ్చి డబ్బులు ఖర్చు పెట్టకుండా గెలిపించుకున్నాడు. అందుకే అందరి చూపు జనసేన పార్టీ వైపు చూస్తున్నారు. దీనికి తోడు రాష్ట్రంలో కొండగట్టు అంజన్నస్వామి దేవాలయానికి ఏ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు.కానీ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రూ.35 కోట్ల 90 లక్షలతో కొండగట్టు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. అందుకే ఆయన మీద నమ్మకంతో తెలంగాణ ప్రజలు జనసేన పార్టీ వైపు చూస్తున్నారు. నీతి నిజాయితీగా అవినీతికి దూరంగా ఉండి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి ప్రజల సమస్యలు తీర్చున్న సందర్భంగా అందరూ జనసేన పార్టీ వైపు చూస్తున్నారు.కామారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో దాదాపు మెజార్టీ స్థానాలు గెలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయం ఆయన ఆలోచన విధానం చూసి ముందుచూపు ఉన్న వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అందరూ జనసేన పార్టీ వైపు చూస్తున్నారు.

## ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి..

వ్యవసాయశాఖ అధికారి రూప



**ఖమ్మం,జనవరి22(సూర్యరేఖ)** ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి రూప రైతులను కోరారు.ప్రతి రైతుకు14నెంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. దాని ప్రకారంగా రైతులు తమ భూముల వివరాలను ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని,కేంద్ర రాష్ట్ర వ్యవసాయం పథకాల లబ్ధి సులభంగా పొందవచ్చని,పీఎం కిసాన్ సాయానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి అని,రైతు వివరాలు కచ్చితంగా నమోదయి పారదర్శకత పెరుగుతుందన్నారు. రాయితీలు రుణాలు సంక్షేమ పథకాలు త్వరగా అందుతాయని,ఒకే ఐడితో లబ్ధిదారునికి భవిష్యత్తు పథకాల ప్రయోజనాలు సులభంగా స్పష్టమైన గుర్తింపుతో మోసాలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఆధార్ కార్డు నెంబరు,భూమి పాసుపుస్తకం,ఆధార్ కాడు తీసుకొని రైతు వేదికలలో,లేదా మీసేవ కేంద్రాలులో నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీల కార్యాలయాలలో నమోదు ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలి

**సిపిఐ (ఎమ్ఎల్)రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి, తోట జీవన్**



**పార్వతీపురం మన్యం జిల్లా,జనవరి22 (సూర్యరేఖ)** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని,అలాగే పని హక్కును కాపాడాలని సిపిఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోటజీవన్న డిమాండ్ చేశారు.అలాగే కార్మిక చట్టం రాష్ట్రానికి భారం,కార్పొరేట్లకు లాభశీ కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై గురువారం జియమ్మ వలస మండలంలోని హరనాడ పంచాయతీ కొత్త వలస గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం కమ్యూనిస్ట్ పార్టీల పోరాటపలితంగా2005 సంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి చట్టం ప్రారంభించడం జరిగిందని,అయితే ప్రధానమంత్రి నరేంద్రమోడీ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసి'విబిజి'రాంజీ స్కీమ్ తేవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు,పేద రైతులకు నష్టం జరిగే పరిస్థితి ఉందని,దీనివల్ల పని హక్కు కోల్పోతున్నారని తెలిపారు.ఈ పథకం అమల వల్ల వ్యవసాయ కార్మికులకు పని గ్యారంటీ లేదని,ఈ చట్టం వల్ల కార్పొరేట్ సంస్థలకు ఉపయోగమని వ్యవసాయ కూలీలకు నష్టం జరిగే పరిస్థితి ఉందని,కార్పొరేట్ వర్గాలు సౌకర్యాల కోసం వేతనాలు తగ్గింపు,లేబర్ కోడ్ లను తెచ్చారని,గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పెంచాలనే ఉద్దేశంతో ఉపాధి చట్టం మార్చారని ఆరోపించారు.కార్పొరేట్ల ఒత్తిడి మేరకే జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేయడం జరిగిందని తెలిపారు.మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ పథకాన్ని నిర్వీరం చేస్తూ వస్తున్నారని,2021లో ఈ పథకానికి సంబంధించి రూ.లక్ష 11వేల కోట్లు కేటాయించగా 2024-2025 సంవత్సరంలో కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు.పేదలకు ఉపయోగపడే ఈ పథకానికి నిధులు కేటాయించలేదని,కానీ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అప్పగిస్తున్నారని అన్నారు. పేదలకు,వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని, 2005 సంవత్సరంలో గ్రామీణ ఉపాధి పథకంలో కేంద్రం90 శాతం నిధులు ఇస్తే రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించే పరిస్థితి ఉందని కేంద్రం కొత్త చట్టాన్ని తెచ్చిన తర్వాత కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరించవలసిన పరిస్థితి వస్తుందని అన్నారు.ఈ పథకాన్ని క్రమేపి ఎత్తివేసే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందని,పథకాన్ని రాష్ట్ర కూటమి ప్రభుత్వం వైసిపి పార్టీలు ఆమోదించటం సిగ్గుచేటని,ఈ కొత్త చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎమ్ ఎల్) రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య బిడ్డిక రమణ మూర్తి,ఉపాధి హామీ కూలీలు రమేష్,నాగ,ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ఇది రాజకీయ కక్షసాధింపు చర్యే :

**కేటీఆర్‌పై సిట్ దర్యాప్తును ఖండించిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**



**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)** మొన్న హరీష్ రావుకు,ఇవాళ కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యేనని మాజీ కౌన్సిలర్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హరీష్ రావు,ల పై సిట్ దర్యాప్తుకు పిలవడాన్ని తీవ్రంగా ఖండించారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను వదిలేసి,ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షకు పాల్పడుతుందని విమర్శించారు.విపక్ష నాయకులను వేధించడానికి చేస్తున్న దుర్మార్గమైన చర్య అని అన్నారు.సమయాన్ని వృథా చేయడంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత నుంచి దృష్టిని మరల్చడానికి నాయకులపై కేసులు వేస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికే ఈ కేసులో ఎలాంటి సారాంశం లేదని సుప్రీం కోర్టు స్పష్టంగా తెలిపిందని పేర్కొన్నారు. అధికార పార్టీ నిరాశ భయంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు.కేవలం రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి,బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి చేస్తున్న కుట్ర అని ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల వేళ ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి నోటీసులు ఇస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు అల్లాడుతున్నా,రైతు భరోసా ఊసే లేదని ధ్వజమెత్తారు.ఫోన్ ట్యాపింగ్,ఫార్ములా ఈ-రేస్ వంటి కేసుల్లో ఎలాంటి ఆధారాలు లేవని, రెండేళ్లుగా దర్యాప్తు చేసినా ఏమీ తేల్చలేకపోయారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి సర్కారు ఆడించినట్లు పోలీస్ యంత్రాంగం ఆడటం విచారకరమని అన్నారు. ముఖ్యమంత్రి దావోస్‌లో విహరిస్తుంటే, ఇక్కడ అక్రమ అరెస్టులు విచారణలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా వాటన్నింటినీ న్యాయ పరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# రామంతపూర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క ఆకు తొలగింపు

**హైడ్రా కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్,జనవరి22(సూర్యరేఖ)** హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇతర అధికారులకు హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.బుధవారం హైదరాబాద్ హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ని కలిసి రామంతపూర్ పెద్ద చెరువు చిన్నచెరువు సుందరీకరణ చేయవలసిందిగా కోరడం జరిగింది.దానికి స్పందించిన హైడ్రా అధికారులు వెంటనే గురువారం రామంతపూర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క ఆకు తొలగింపు కార్యక్రమాన్ని మొదలు పెట్టినారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనుశీపల్లి వెంకటేశ్వర రెడ్డి,గడ్డం రవికుమార్,ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళిగౌడ్,హబ్సిగూడ డివిజన్ సీట్ నెంబర్-8 ఆల్ కాలనీస్ ప్రెసిడెంట్ ప్రదీప్ రెడ్డి,రెడ్డి సంఘం అధ్యక్షులు కొమ్మిడి మల్లారెడ్డి,మహేశ్వరి నగర్ కాలనీ అధ్యక్షులు అరవింద్ రెడ్డి,సీనియర్ సిటిజన్ అధ్యక్షులు కర్ణాకర్ రెడ్డి,సాయి చిత్రనగర్, లక్ష్మీనగర్, మహేశ్వరినగర్ కాలనీ ప్రతినిధులు ప్రతాపరెడ్డి దాసరి కృష్ణారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ మొదలైన వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ...తన విజ్ఞప్తిని మన్నించి వెంటనే చెరువును సుదరీకరణ చేపట్టినందుకు మరొకసారి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ గోధుమల రాజుకి ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సారంగపల్లిలో వ్యవసాయ విద్యార్థుల గ్రామీణ భాగస్వామ్య తులన





**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ)** మండలంలోని సారంగపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయంలో గ్రామీణ భాగస్వామ్య తులనపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామీణ భాగసౌమ్య తులనని నిర్వహించారు. విద్యార్థులు గత పదిహేను రోజులుగా గ్రామాన్ని పరిశీలించి గ్రామ వనరులు వనరుల పటం ద్వారా, సమస్యలను సమస్యల చెట్టు రూపంలో కాలానుగుణంగా జరిగిన అభివృద్ధిని కాలక్రమ పటం ద్వారా పంటల వివరాలు బార్ గ్రాఫ్ పైచార్ట్ ల రూపంలో రంగవల్లులు వేసి రైతులకు అధికారులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెన్నూరు వ్యవసాయశాఖ ఏడీఏ బానోత్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ...విద్యార్థులు గ్రామంలో ఉన్న వనరులు,పంటల సాగు సరళి,సాగు సమస్యలు, భూసార పరిరక్షణ,పంట మార్పిడి విధానాల అవసరం తదితరాలు రైతులకు వివరించారని అంతే కాకుండా రంగవల్లుల రూపంలో చక్కగా అర్థమయ్యేలా వివరించిన విద్యార్థులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బచ్చలి రాములు,మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి,విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, కార్యదర్శి సవ్య రైతులు ఫిరోజ్,బండి మహేందర్, మహిపాల్ రెడ్డి,మహేందర్ రెడ్డి,నయీమ్,ఫర్వేజ్, విద్యార్థులు సౌమిత్,అల్మాస్,సాయి,లీలాధర్, కారోబార్ మధుతదితరులు పాల్గొన్నారు.

## పతకాలు సాధించిన కళాకారులను అభినందించిన ఏరియా జీఎం..



**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ)** మహారాష్ట్రలోని నాగపూర్ లో డబ్ల్యూసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల17న నిర్వహించిన కోలిండియా పోటీల్లో సింగరేణి ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి గోల్డ్ మెడల్ సాధించిన కళాకారులను సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అభినందించారు.గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోలిండియా పోటీల్లో పలు విభాగాల్లో సింగరేణి కళాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.సాంస్కృతిక పోటీల్లో 10 జట్లు పాల్గొనగా సింగరేణి తరపున మందమర్రి ఏరియా నీలాల శ్రీనివాస్ సాంస్కృతిక విభాగం సభ్యులు జానపద నృత్యంలో సత్తాచాటి గోల్డ్ మెడల్ సాధించారు.ఈ సందర్భంగా ఏరియా జీఎం. రాధాకృష్ణ మాట్లాడుతూ. కళాకారులు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో జరిగే పోటీలలో పాల్గొని సింగరేణి సత్తా చాటాలని,మరెన్నో పతకాలు సాధించి సింగరేణికి కోల్ ఇండియా లెవెల్ లో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జీఎల్ ప్రసాద్, ఎఐటియుసి రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ,డిజిఎం పర్సనల్ అశోక్,ఎస్కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్,టీంమేనేజర్ కార్తిక్,శాంతిఖని గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హ,జీఎం స్థాయి స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణతో పాటు ఈ విజయంలో భాగస్వాములైన కళాబృంద సభ్యులు కళాకారులు నీలాల శ్రీనివాస్,కెఆర్ సంపత్,యు.సాగర్,ఎం. విజయ్ ఎల్.వినయ్,ఏలూరు శ్రీనివాస్,కె. వెంకటస్వామి పీ.స్వామి,ఎస్. అనిల్‌కుమార్,ఎగ్గేటి రాజేశ్వర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

## నజీర్ సౌండ్స్ అండ్ లైట్స్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు..

**విజేతలకు బహుమతులు అందజేసిన తహసీల్దార్**



**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ)** పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో అంజనిపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నజీర్ సౌండ్స్ అండ్ లైట్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాఠశాల స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మండల తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ. క్రీడల ద్వారా క్రమశిక్షణ, సహనం,జట్టు భావన పెంపొందుతాయని, విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు క్రీడలను కేవలం పోటీలుగా కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని,విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే చదువుతోపాటు వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు.ఈ పోటీల్లో పట్టణానికి చెందిన తొమ్మిది పాఠశాలలు పాల్గొనగా హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో సింగరేణి ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించగా, కృష్ణవేణి టాలెంట్ ఉన్నత పాఠశాల రన్నర్ గా నిలిచింది.ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం,కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రాంవేణు,పోటీల నిర్వాహకులు సమీర్, గుల్షన్,చంటి,శీను,ప్రసాద్,ఖలీల్,హాభిబ్, నజీర్ సౌండ్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## వేలాల జాతర కోసం పార్కింగ్ స్థలాల పరిశీలన..



**చెన్నూర్,జనవరి22(సూర్యరేఖ)** జైపూర్ మండలంలోని వేలాల మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా పార్కింగ్ స్థలాలను పంచాయతీ కార్యదర్శి,పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా జరగబోయే మహాజాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. భక్తుల సౌకర్యం కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేగ స్వప్న-నగేష్, ఉపసర్పంచ్ సుందిళ్ల రాజలింగు,గ్రామ పంచాయతీ కార్యదర్శి,గ్రామ ప్రజలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 28 నుండి సీఎం కప్ క్రీడలు





ఎంఈఓ శంకరయ్య

**మేడ్చల్,జనవరి22(సూర్యరేఖ)**సిఎం కప్ -2025 మేడ్చల్ మండల స్థాయి సెకండ్ ఎడిషన్ సీఎం కప్ క్రీడలు మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల తేదీ 28 నుండి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ. క్యారమ్స్,చెస్, వాలీబాల్, కబడ్డీ,కోకో,క్రీడ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.పై ఐదు క్రీడాంశాలలో ఆసక్తిగల యువతి, యువకులు,విద్యార్థినీ,విద్యార్థులు తమ పేర్లను ఆన్లైన్ లింకు ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.రిజిస్ట్రేషన్ లేకుండా పాల్గొనే అవకాశం లేదని ఎంఈఓ స్పష్టం చేశారు.సీఎం కప్ మేడ్చల్ మండల స్థాయి పోటీలకు సంబంధించిన సమాచారం నరేందర్ పిడి ఫోన్ నెంబర్ 8897583354ద్వారా సంప్రదించాలని కోరారు.సీఎం కప్ టార్చ్ ర్యాలీని మేడ్చల్ పట్టణంలో ఎంఈఓ శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ వర్సిటీ బోధన సిబ్బందికి పలు వైద్య సదుపాయాలు కల్పించాలి

మంత్రి దామోదరను కోరిన తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు





**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న బోధన సిబ్బందికి పలు రకాల వైద్య సదుపాయాలను కల్పించాలని తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాను కోరారు.ఈ మేరకు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన సిబ్బందికి హెల్త్ స్కీం,హెల్త్ కార్డ్స్,యాక్సిడెంట్ హెల్త్,ఇన్సూరెన్స్ స్కీం వర్తించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు బోధన సిబ్బంది నిరంతరం రైతు సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ వ్యవసాయ క్షేత్రాలలో,రైతుల పొలాలలో పరిశోధన నిమిత్తం తిరగడం జరుగుతుందన్నారు.కావున వారికి,వారి కుటుంబానికి హెల్త్ కార్డ్స్,హెల్త్ ఇన్సూరెన్స్ స్కీములు వర్తింపజేసి ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు.ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.ఈ సందర్భంగా వారికి తమ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.శంకర్,ప్రొఫెసర్ రాజేశ్వర్ నాయక్,డాక్టర్ భరత్ భూషణ్,డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు,డాక్టర్ పి రేవతి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో మున్సిపల్ స్థానాలన్నీ బీఆర్ఎస్‌కే ప్రజల తీర్పు ఖాయం

బెల్లంపల్లి,మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**బెల్లంపల్లి,జనవరి22(సూర్య రేఖ) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ స్థానాలపై ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కే పట్టం కడతారని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ధీమా వ్యక్తం చేశారు.మున్సిపాలిటీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు.పట్టణాల్లో మౌలిక వసతులు రహదారులు,తాగునీరు,డ్రైనేజీ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిందన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు.తదుపరి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పట్టణ పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీలను బలోపేతం చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న పార్టీకి మరోసారి అవకాశమివ్వాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి ప్రభుత్వ విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# వసంత పంచమి పేరుతో అక్రమ అడ్మిషన్లు-విద్య వ్యాపారం కాదు

టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్



**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)**వసంత పంచమి వంటి పవిత్రమైన పండుగను ఉపయోగించుకొని విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్లు చేపడుతుండటంపై టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు శంషాబాద్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన హాజరై మాట్లాడుతూ. “వసంత పంచమి అనేది విద్య,జ్ఞానానికి ప్రతీక అని అన్నారు.అలాంటి పండుగను వ్యాపారంగా మార్చి,ముందస్తు అడ్మిషన్లు,డొనేషన్ల వసూలు చేయడం చట్టవిరుద్ధమన్నారు.విద్య వ్యాపారం కాదని,అది బాధ్యత,సేవ అని స్పష్టం చేశారు. విద్యాశాఖ నిర్ణయించిన అడ్మిషన్ నిబంధనలు కాలపరిమితులను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రులపై మానసిక ఒత్తిడి తెచ్చే విధానాలు అమలు చేయడం పూర్తిగా తప్పని ఆయన అన్నారు.పిల్లల భవిష్యత్తును నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ దోపిడీ చేయనివ్వకండని,ప్రభుత్వ నిబంధనలే పిల్లలకు రక్షణ కవచమని విజ్ఞప్తి చేశారు. అధికారులు నిబంధనలను కఠినంగా అమలు చేస్తారని,తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. అక్రమ అడ్మిషన్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన నాణ్యమైన విద్య కోసం విద్యాశాఖ తల్లిదండ్రులు సమాజం కలిసి పనిచేయాలన్నారు. విద్యార్థుల హక్కుల కోసం టిఎస్ఎస్ఓ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ఓ సభ్యులు సర్వజిత్ నికేతిన్ విశ్వంత్ శ్రీధర్ గజానంద్ ఉదయ్ నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ ఎయిర్ పోర్టులో రాజ్యసభ్యులు లక్ష్మణ్ కు స్వాగతం పలికిన రాజేంద్రనగర్ నాయకులు



**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఎన్నికలో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన జాతీయ ఓబీసీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ ఢిల్లీ నుంచి నగరానికి చేరుకోవడంతో శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లో పలువురు బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ మేరకు ఆయన పుష్పగుచ్ఛం అందించి లక్ష్మణ్ ను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో గోషామహల్ గోల్కొండ జిల్లా ఇన్చార్జి వై.శ్రీధర్,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య,రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి గుడిసె యాదయ్య,రాజేంద్రనగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు జి బాబురావు,డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులను ఆదుకున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో పేద విద్యార్థులకు తన వంతుగా అండగా ఉంటానని రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో నివాసముండే సాయిరాంగౌడ్ గత సంవత్సరం చనిపోవడం జరిగింది.వారి కుమార్తెలు వైష్ణవి,సుభాషినిలు చదువు నిమిత్తం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను సంప్రదించగా హాస్టల్ కొరకు సిఫారసు లేఖను అందజేశారు.ఎమ్మెల్యే చొరవతో ఇద్దరు విద్యార్థినిలు కీసరలోని బాలికల ప్రభుత్వ హాస్టల్లో సీటు పొందారు.తండ్రి లేని పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేసిన ఎమ్మెల్యేకు విద్యార్థినిల తల్లి అపర్ణ,బంధువులు శ్రీనివాస్ గౌడ్, హరీష్ గౌడ్‌లు అభినందనలు తెలిపారు.ఈ మేరకు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. స్థానికంగా పేద విద్యార్థులకు తన వంతుగా అండగా ఉంటానని వివరించారు.

## భార్య కాపురానికి రావడం లేదని యువకుడు ఆత్మహత్య



**మందమర్రి,జనవరి22(సూర్యరేఖ) :** ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యతో విబేధాలు ఏర్పడి కాపురానికి రావడం లేదని,మనస్తాపం చెందిన ఇటికాల శ్రావణ్ (34) అనే యువకుడు గురువారం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ పరిధిలోని శాంతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానిక ప్రజలు పోలీసులు అందించిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లికి చెందిన సుమన్య అనే యువతిని ఇటికాల శ్రావణ్ తొమ్మిది సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు.వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది.అయితే గత నాలుగేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో గత రెండేళ్లుగా సుమన్య తన తల్లిగారి ఇంట్లోనే ఉంటుంది.గురువారం మధ్యాహ్నం సమయంలో శ్రావణ్ తన భార్యకు ఫోన్ చేసి కాపురానికి రావాలని కోరాడు.ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఫోన్లో తీవ్ర వాగ్వాదం జరిగింది.ఆగ్రహానికి గురైన శ్రావణ్ తన సెల్‌ఫోన్‌ను నేలకేసి కొట్టి,ఆవేశంగా గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు.ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పొరుగువారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా శ్రావణ్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఉరి నుంచి కిందకు దించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.అక్కడకు చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది శ్రావణ్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.మృతుని బావ కొమరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మందమర్రి ఎస్సై నరేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ప్రశ్నిస్తే అక్రమ కేసులా :

రాజేంద్రనగర్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఎడ్లకాడి సూర్యం



**రాజేంద్రనగర్,జనవరి22(సూర్యరేఖ)** ప్రజల తరపున ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతున్నదని రాజేంద్రనగర్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఎడ్లకాడి సూర్యం మండిపడ్డారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు,హరీష్ రావు,ల పై సిట్ దర్యాప్తుకు పిలవడాన్ని తీవ్రంగా ఖండించారు.బీఆర్ఎస్ నాయకత్వాన్ని అణచివేయాలనే కుట్రతో మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్,లకు రేవంత్ సర్కార్ సిట్ నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ నేతలు చేసిన కుంభకోణాలు వెలికితీస్తున్నందుకే తమ పార్టీ నేతలను వేధిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలు అని విమర్శించారు.మంత్రుల పంచాయితీలను పక్కదారి పట్టించేందుకే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

# ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ కళ్యాణ్ హుక్ స్టెప్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌కమింగ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' చుట్టూ రోజుకో కొత్త అప్‌డేట్ హల్‌చల్ చేస్తోంది. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం పవన్ కళ్యాణ్ ఇప్పటికే తనకు సంబంధించిన షూటింగ్ పార్ట్‌ను పూర్తి చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయట. మేకర్స్ ఈ సినిమాను ఏప్రిల్ 23 లేదా 24 తేదీల్లో థియేటర్లలోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు డేట్స్‌లో ఒకటి మాత్రం ఫైనల్ అని అంటున్నారు. రిలీజ్ డేట్‌తో పాటు ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ టాక్ పవన్ ఫ్యాన్స్‌ను మరింత ఉత్సాహపరుస్తోంది. ఇటీవల 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాలో మెగాస్టార్ చిరంజీవి వేసిన హుక్ స్టెప్స్ ఎంతటి వైరల్ అయ్యాయో తెలిసిందే. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఆ స్టెప్స్‌కు ఫిదా అయిపోయారు. సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్‌తో ఆ హుక్ స్టెప్ ట్రెండ్‌గా మారిపోయింది. ఇలాంటి హుక్ స్టెప్‌ను ఇప్పుడు పవన్ కళ్యాణ్‌తో కూడా చేయించేందుకు 'ఉస్తాద్ భగత్ సింగ్' టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సాంగ్‌ను రెడీ చేస్తున్నారట. దర్శకుడు హరీశ్ శంకర్, ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కలిసి పవన్ కోసం స్పెషల్ హుక్ స్టెప్ సాంగ్‌ను డిజైన్ చేస్తున్నారని సమాచారం. తాజాగా హరీశ్ శంకర్, చంద్రబోస్ కలిసి ఉన్న ఫోటోలు కూడా బయటకు రావడంతో ఈ టాక్‌కు మరింత బలం చేకూరింది. ఈ వార్త నిజమైతే పవన్ కళ్యాణ్ స్టైల్‌లో హుక్ స్టెప్స్ థియేటర్లలో ఫ్యాన్స్‌ను ఊపేస్తాయనే చెప్పాలి. ఇప్పటికే పవన్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుందని అంచనాలు ఉండగా, ఇప్పుడు ఈ హుక్ స్టెప్ సాంగ్ ఫ్యాన్స్‌కు స్పెషల్ అట్రాక్షన్‌గా మారనుందని భావిస్తున్నారు. పవన్ డాన్స్ స్టెప్స్‌కు థియేటర్లు రచ్చరచ్చే అవుతాయని సోషల్ మీడియాలో అభిమానులు ఇప్పటి నుంచే కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒక్కో అప్‌డేట్‌తో అంచనాలను మరింత పెంచేస్తోంది.




## 'డేవిడ్ రెడ్డి'తో స్ట్రాంగ్ రీఎంట్రీకి సిద్ధమైన మంచు మనోజ్.. రిపబ్లిక్ డేకు ఫస్ట్ లుక్ విడుదల!

మంచు మనోజ్ అభిమానులకు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న శుభవార్త అందింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఇప్పుడు తన కొత్త సినిమాతో పవర్‌ఫుల్ రీఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు 'డేవిడ్ రెడ్డి' అనే ఇంటెన్స్ టైటిల్ ఖరారైంది. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి బజ్ ఏర్పడగా, తాజాగా మనోజ్ చేసిన ప్రకటన అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచింది. జనవరి 26, 2026న, రిపబ్లిక్ డే సందర్భంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నట్లు మనోజ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. జాతీయ పండుగ రోజున ఫస్ట్ లుక్ రిలీజ్ చేయడం సినిమాకు ప్రత్యేక హైప్‌ను తీసుకువచ్చే అంశంగా మారింది. ఈ సినిమా మనోజ్ కెరీర్‌లో ఒక కీలక మలుపుగా నిలవబోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రీ-లుక్ పోస్టర్ సినిమాకి ఉన్న టోన్‌ను స్పష్టంగా చూపించింది. ముఖంపై రక్తంతో నిండిన గుడ్డ, కళ్లలో ఉగ్రతతో కనిపిస్తున్న మనోజ్ లుక్ చూసి ఇది పూర్తిస్థాయి మాస్, వైలెంట్ యాక్షన్ మూవీ అని అర్థమవుతోంది. ఇప్పటివరకు మనోజ్ చేసిన పాత్రలకు భిన్నంగా, ఈసారి మరింత రా అండ్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారని అభిమానులు అంచనా వేస్తున్నారు. పోస్టర్ నుంచే సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమాకు హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తుండగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మోటుకూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం హై స్టాండర్డ్స్‌లో తెరకెక్కుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సంగీతం విషయానికి వస్తే, 'కేజీఎఫ్' సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ మూవీకి మరింత బలాన్ని చేకూర్చనుందని అంచనా. మనోజ్ తన పోస్ట్‌లో "దీ=ఖూూా జు=ూా దీజు+×చీూ" అనే క్యాప్షన్‌ను ఉపయోగించడం కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ ఒక్క లైన్‌తోనే 'డేవిడ్ రెడ్డి' ఎంత రఫ్, రియలిస్టిక్ యాక్షన్‌తో రూపొందుతోందో చెప్పేశారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, హ్యాష్‌ట్యాగ్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై హైప్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాయి. ఇప్పుడు అందరి చూపు జనవరి 26, 2026న విడుదలయ్యే ఫస్ట్ లుక్‌పైనే ఉంది.



# వాలైంటైన్స్ డే స్పెషల్.. బిగ్ స్క్రీన్‌పై చైతూ-సాయిపల్లవి లవ్ స్టోరీ

నాగ చైతన్య,సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'లవ్‌స్టోరీ'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రేమకథా చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. 2021లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రంలో చైతూ, సాయిపల్లవి నటనకు ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఈ సినిమా చైతూ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా ఈ లవ్ ఎంటర్‌టైనర్‌ను మరోసారి బిగ్ స్క్రీన్‌పైకి తీసుకొస్తున్నారు. ఈ ఏడాది వాలైంటైన్స్ డే సందర్భంగా థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని హీరో నాగచైతన్య ట్విటర్ ద్వారా వెల్లడించారు. నా హృదయానికి హత్తుకున్న సినిమా లవ్ స్టోరీ.. ఈ ఏడాది ఫిబ్రవరి 14న మరోసారి థియేటర్లలో సందడి చేయనుందని తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ లవ్ స్టోరీ మూవీ పోస్టర్‌ను పంచుకున్నారు. ఇది చూసిన అక్కినేని అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. లవర్స్ డే రోజున థియేటర్లలో మరోసారి లవ్ స్టోరీ చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## పవన్ కల్యాణ్‌తో సినిమాపై క్లారిటీ.. త్వరలోనే 10వ మూవీ..



దర్శకుడిగా వరుస బ్లాక్‌బస్టర్లు కొడుతున్న అనిల్ రావిపూడి.. 10వ సినిమా ఎవరితో? అని ఇప్పటికే చర్చ మొదలైంది. కొంతకా లంగా మన శంకర వరప్రసాద్ విజయాన్ని ఆస్వాదిస్తున్న ఆయన తాజాగా తన నెక్ట్స్ సినిమాపై అప్‌డేట్ ఇచ్చాడు. చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రలో నటించిన మన శంకరవర ప్రసాద్‌గారు మూవీ తాజాగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది.

**సరైన నిర్ణయం తీసుకోకపోతే**

ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. ఇది నాకు కాస్త కష్టమైన సమయం. ఎందుకంటే సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్‌బస్టర్ తర్వాత నేను చేసిన సినిమా ఒక ఎత్తయితే.. ఇప్పుడు రెండు భారీ హిట్స్ తర్వాత సినిమా అంటే కాస్త గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే ఆలోచనలు ఎక్కువైపోతాయి. ఇప్పుడు సరైన నిర్ణయం తీసుకోకపోతే దారి తప్పిపోతాం. అందుకే పదిరోజులు గ్యాప్ ఇచ్చాను. తాజాగా వైజాగ్ టూర్‌లో ఒక ఆలోచన వచ్చింది. ఈసారి టైటిల్ ప్రకటన నుంచే ఒక విచిత్రమైన జర్నీ మొదలుకాబోతోంది. ఇది చూసి చాలామంది వామ్మో, ఇదేంట్రా బాబూ అనుకుంటారు. మరికొందరు హమ్మయ్య, ఇంకో సినిమాతో వస్తున్నాడు అనుకుంటారు. కచ్చితంగా ఒక మ్యాజిక్ అయితే జరగబోతోంది. టైటిల్ మాత్రం విచిత్రంగా ఉంటుంది. త్వరలోనే ఆ టైటిల్ ప్రకటిస్తాను.

**పవన్ కల్యాణ్‌తో కాదు!**

ఈ సినిమాలో నటీనటులను ఎవర్నీ అనుకోలేదు. కథ లైన్ మాత్రమే ఫిక్స్ అయ్యాను. అందులో ఎవరు చేస్తే బాగుంటుంది? ఎవరి డేట్స్ దొరుకుతాయి? అన్నది చూడాలి. అన్నింటికంటే ముఖ్యం డేట్స్ దరకడం కదా! జూన్, జూలైలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. పవన్ కల్యాణ్‌ను నేను కలవలేదు, ప్రస్తుతానికైతే ఆయన్ను అయితే అనుకోలేదు అని చెప్పుకొచ్చాడు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,